teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 02 | సంచిక : 346 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 19 ఏప్రిల్ 2024 | పేజీలు : 08 | వెల ‘5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## ఇంటర్ ఫలితాల విడుదలకు ఇంటర్ బోర్డు నిర్ణయం

**ఈ నెల 23 లేదా 24న విడుదల కానున్నట్లు సమాచారం**



తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఇంటర్ విద్యార్థులకు బిగ్ అలర్ట్. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంటర్ ఫలితాలు రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ ఇంటర్ ఫలితాల

మిగతా 2 లో



## తెలుగు రాష్ట్రాల్లో మొదలైన ఎన్నికల ప్రక్రియ కీలక ఘట్టం

**తెలంగాణలో మొదలైన నామినేషన్ల దాఖలు**




తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 18 (తీన్మార్ న్యూస్): రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియకు కీలక ఘట్టం మొదలైంది. ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలు, 25 లోక్ సభ స్థానాలు, తెలంగాణ 17 ఎంపీ స్థానాలకు అధికారులు

మిగతా 2 లో

# వివేకంతో ఓటేసే సమయమిది!


## ఓటును అమ్ముకోవడమా లేక నమ్ముకోవడమా

దేశంలో శుక్రవారం తొలిదశ సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ జరుగబోతున్నది. మరో ఐదేళ్ల పాటు మనమంతా ఎవరి పాలనలో ఉండాలో..ఎవరైతే ప్రజలకు, దేశానికి అవసరమో గుర్తించి ఓటేయడం అలవాటు చేసుకోవాలి. ఓటును అమ్ముకోవడమా లేక నమ్ముకోవడమా అన్నది భారతీయులు గుర్తించాలి. ఉన్నంతలో ఎవరు మంచో ..ఎవరు చెడో బేరీజు వేయాలి. ఆయా రాంగాలను తీసుకుని చర్చ చేయాలి. లేదా తెలిసిన వారితో చర్చించాలి.



తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 18 (తీన్మార్ న్యూస్): ఏడుదశల్లో జరిగే ఎన్నికల్లో అన్ని పార్టీల రంగు,రుచి ప్రజలకు తెలుసు. ప్రాంతీయ పార్టీలతో పాటు, జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపిల పాలన కూడా చూశాం. ఇందులో ఎవరు ప్రజలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటారో అన్నది చూడాలి. ఎందుకంటే గత పదేళ్ల మోడీ పాలనను బేరీజు వేసుకోవాల్సి ఉంటుంది. అలాగే అంతకుముందు పదేళ్ల యూపిఎ పాలనను కూడా బేరీజు వేసుకోవాలి. మోడీ పదేళ్ల పాలనలో నిరుద్యోగం పెరిగిందే తప్ప తగ్గలేదు. నిరుద్యోగం రూపుమాపే చర్యలు తీసుకోలేదు. ధరలు విపరీతంగా పెరిగాయి. జిఎస్టీతో ప్రజల నడ్డి విరుస్తున్నారు. మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై జాతీయస్థాయి ఉద్యమం చేసేంతగా సమస్యలు ఏర్పడ్డాయి. విపక్షాలను కూడా ప్రజలు నమ్మడం లేదు. అలాగే ఆయా రాష్ట్రాల్లో ప్రజారంజక పాలన

మిగతా 2 లో



## బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మారుస్తారంట

**దేశంలో దళితులపై దాడులు రోజు రోజుకు పెరుగుతాయ్**

**భారతీయ జనతా పార్టీ కుట్రలను తిప్పికోట్టాలి**

**కాంగ్రెస్ పార్లమెంట్ సన్నాహాకా సమావేశంలో కడియం శ్రీహరి వాఖ్యలు**



హనుమకొండ, ఏప్రిల్ 18 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లాలోని డి కన్వెన్షన్ హల్ లో వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్లమెంట్ సన్నాహాకా సమావేశంలో ఎమ్మెల్యే

మిగతా 2 లో

## లిక్కర్ స్కాం కేసులో ఆధారాలు ఉన్నందుకే కవిత అరెస్ట్

**ఆరోపించిన బీజేపీ రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్**

**ఆధారాలు లేకుండా ఏ దర్యాప్తు సంస్థ వ్యక్తులను అరెస్ట్ చేయదని స్పష్టం**




తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 18 (తీన్మార్ న్యూస్): ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఆధారాలు ఉన్నందుకే ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్ట్ చేసిందని బీజేపీ రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆధారాలు

మిగతా 2 లో

## డీఎస్సీ పోటీ పరీక్ష అభ్యర్థులకు మరో అప్డేట్

**డీఎస్సీ అభ్యర్థులకై టీశాట్ ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలు**

**ప్రకటన విడుదల చేసిన టీశాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి**



హైదరాబాద్, ఏప్రిల్ 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి తనదైన మార్క్ చాటుకుంటున్నారు. తొలి సంతకం ఆరు గ్యారెంటీ పథకాలపై చేశారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీ పథకాల హామీ అమలు చేసే పనిలో ఉన్నారు. ఇప్పటికే మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు ప్రారంభించారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ఆరు గ్యారెంటీ పథకాల దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా

మిగతా 2 లో



## 64 మంది ఎమ్మెల్యేల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుకుండా ఉంచుతాడా

**111 మంది ఎమ్మెల్యేలు ఉన్న బీఆర్ఎస్ నే కూలగొట్టాలని చూశాడు**

**ఏడాది తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం గందరగోళంలో పడుతుంది**

**ప్రధాని మోడీపై కేసీఆర్ సంచలన ఆరోపణలు**

హైదరాబాద్, ఏప్రిల్ 18 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. ఏడాది తర్వాత

మిగతా 2 లో




## ఏ బటన్ నొక్కినా "బీజేపీకే ఓటు పడుతుందన్న" వార్తలతో తీవ్ర కలకలం

**పోలింగ్ ఏజెంట్ల ఫిర్యాదుపై విచారణకు సిద్ధమవుతున్న ఈసీ**

**సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలు**

దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న వేళ కేరళలోని కాసర్ గోడ్ లో నిర్వహించిన మాక్ పోలింగ్ లో ఏ బటన్ నొక్కినా బీజేపీకే ఓటు పడుతుందన్న వార్తలు తీవ్ర కలకలం రేపాయి.

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 18 (తీన్మార్ న్యూస్): ఈ మేరకు ఎల్డీఎఫ్, యూడీఎఫ్ అభ్యర్థులకు చెందిన పోలింగ్ ఏజెంట్లు చేసిన ఫిర్యాదుపై ఈసీ విచారణకు సిద్ధమవుతోంది. అదే సమయంలో దీనిపై సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలు కావడంతో అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. కేరళలోని కాసర్ గోడ్ లోక్ సభ

మిగతా 2 లో

# తెలుగు రాష్ట్రాల్లో మొదలైన ఎన్నికల ప్రక్రియ కీలక ఘట్టం

**మొదటి పేజీ తరువాయి**

నామినేషన్లు స్వీకరిస్తున్నారు. తొలి రోజు ఆర్వో కేంద్రాల్లో పలువురు కీలక నేతలు రిటర్నింగ్ అధికారులకు తమ నామినేషన్లు సమర్పించారు. ఈ నెల 25వ తేదీ వరకు స్వీకరించిన నామినేషన్లను అధికారులు పరిశీలిస్తారు. 26 వరకు వాటిని స్క్రూట్నీ చేస్తారు. ఇంతలో ఎవరైనా తమ నామినేషన్లు ఉపసంహరించుకోవాలంటే ఏప్రిల్ 29 వరకు గడువు విధించారు. ఆ లోపు నామినేషన్లు వెనక్కి తీసుకోవచ్చు. అనంతరం ఫైనల్గా పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ఎన్నికల అధికారులు ప్రకటిస్తారు. అనంతరం మే 13న పోలింగ్ నిర్వహించి జూన్ 4న ఫలితాలు ప్రకటిస్తారు. వివిధ పార్టీలకు చెందిన నేతలు భారీ ర్యాలీలతో ఆర్వో కార్యాలయాల వద్దకు చేరుకోగా అక్కడ సందడి నెలకొంది. ఏపీలోని ఒంగోలు లోక్ సభ స్థానానికి టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి నామినేషన్ వేశారు. తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డితో కలిసి ఆర్వో కార్యాలయానికి చేరుకున్న ఆయన కలెక్టర్ దినేష్ కుమార్ కు మొదటి సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ నెల 25న ర్యాలీతో రెండో సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. అలాగే, కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాడు నాగరాజు, విజయవాడ పశ్చిమ శాసనసభ స్థానానికి బీజేపీ తరఫున కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరి నామినేషన్లు వేశారు. తెలంగాణలో మల్కాజిగిరి లోక్ సభ స్థానానికి బీజేపీ తరఫున మాజీ మంత్రి ఈటల రాజేందర్ నామినేషన్ వేశారు. మహబూబ్ నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా డీకే అరుణ, నల్గొండ బీజేపీ లోక్ సభ అభ్యర్థిగా శానంపూడి సైదిరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే, భువనగిరి ఎంపీ స్థానానికి ప్రజావాణి పార్టీ అభ్యర్థిగా లింగిడి వెంకటేశ్వర్లు రెండు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. నాగర్ కర్నూల్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవి నామినేషన్ వేశారు. మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు కూడా మొదటి సెట్ నామినేషన్ వేశారు. అలాగే, జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరఫున కాంగ్రెస్ నాయకులు మొదటి సెట్ నామినేషన్ వేశారు. ఈ నెల 24న సురేష్ షెట్కార్ నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరు కానున్నారు. %రి

# బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మారుస్తారంట

**మొదటి పేజీ తరువాయి**

నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, యశస్వీ రెడ్డిలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గంకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కడియం కావ్య స్థానికురాలే కొత్త మంది నాయకులు అవాస్తవాలు పలుకుతున్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకొని అనేక అక్రమాలకు పాల్పడ్డాడు అని ఆయన చెప్పుకొచ్చారు. రాజకీయాల్లోకి సేవాభావంతో రావాలి తప్ప వ్యాపారం చేసేందుకు కాదన్నారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మారుస్తాం అని చెబుతున్నారు అని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఇక దేశంలో దళితులపై దాడులు రోజు రోజుకు పెరుగుతున్నాయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. భారతీయ జనతా పార్టీ కుట్రలను తిప్పికొట్టాలి. బీజేపీ నేతలు రామున్ని అడ్డు పెట్టుకుని రాజకీయం చేస్తున్నారు. కడియం కావ్యను గెలిపించాలి. కడియం కావ్య గెలిస్తే వర్ధన్నపేటకు సాగు, తాగు నీటిని అందిస్తామన్నారు. రాష్ట్రానికి బీజేపీ- బీఆర్ఎస్ పార్టీలు ఏం చేయలేదన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధే ఇప్పటికి కనిపిస్తుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 15 ఎంపీ స్థానాల్లో విజయం సాధించబోతుందని కడియం శ్రీహరి పేర్కొన్నారు.

# ఏ బటన్ నొక్కినా "బీజేపీకే ఓటు పడుతుందన్న" వార్తలతో తీవ్ర కలకలం

**మొదటి పేజీ తరువాయి**

నియోజకవర్గంలో త్వరలో జరిగే ఎన్నికల కోసం ఈసీ నిర్వహించిన మాక్ పోలింగ్ కోసం తెచ్చిన ఈవీఎంలలో ఏ బటన్ నొక్కినా బీజేపీకే ఓటు పడుతోందని అధికార ఎల్డీఎఫ్, విపక్ష యూడీఎఫ్ పోలింగ్ ఏజెంట్లు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు ఈసీని తక్షణం ఈ వ్యవహారంపై స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇవాళ ఈవీఎం-వీవీ ప్యాట్ యంత్రాలపై దాఖలైన మరో పిటిషన్ పై విచారణ జరిపిన జస్టిస్ సంజీవ్ కుమార్, జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. కేరళలోని కాసర్‌గోడ్ నియోజకవర్గంలో ఈవీఎంలపై నిర్వహించిన మాక్ పోల్స్‌కు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై మనోరమ ఆన్‌లైన్ పత్రిక ప్రచురించిన కథనాన్ని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. ఈ మాక్ పోలింగ్ లో నాలుగు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు బీజేపీకి అనుకూలంగా అదనపు ఓట్లను తప్పుగా నమోదు చేశాయని ఎల్డీఎఫ్, యూడీఎఫ్ రిటర్నింగ్ అధికారి అయిన కలెక్టర్ కు ఫిర్యాదు చేశాయని తెలిపారు.

# 64 మంది ఎమ్మెల్యేల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుకుండా ఉంచుతాడా

**మొదటి పేజీ తరువాయి**

కాంగ్రెస్ ప్రభుత్వం గందరగోళంలో పడుతోందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ దుర్మార్గుడు అని బీఆర్ఎస్‌కు 111 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పుడే మన ప్రభుత్వాన్ని కూలగొట్టాలని చూశాడు. ఇప్పుడు 64 మంది ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుకుండా ఉంచుతాడా అని సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. కాకపోతే మన ఎమ్మెల్యేలను కొనాలని చూసి వాళ్లను అప్పుడు మనం దొరకబట్టినమని చెప్పారు. ఇక, సీఎం రేవంత్ రెడ్డి బీజేపీలోకి వెళ్తాడని నేను అనుకోవడం లేదని కేసీఆర్ అన్నారు. ఒక వేళ సీఎం రేవంత్ రెడ్డి బీజేపీలోకి వెళ్లిన ఆయన వెంట కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెళ్లరని గులాబీ బాస్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. అయితే, పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీజేపీలోకి వెళ్లే తొలి వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డేనని కేసీఆర్ కొడుకు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపిస్తుండగా.. కేసీఆర్ మాత్రం రేవంత్ రెడ్డి బీజేపీలోకి వెళ్తాడని తాను అనుకోవడం లేదనడం హాట్ టాపిక్‌గా మారింది.

# లిక్కర్ స్కాం కేసులో ఆధారాలు ఉన్నందుకే కవిత అరెస్ట్



**మొదటి పేజీ తరువాయి**

లేకుండా ఏ ప్రభుత్వ దర్యాప్తు సంస్థ వ్యక్తులను అరెస్ట్ చేయబోదని స్పష్టం చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కవితను ఎందుకు అరెస్ట్ చేయలేదంటూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు బీజేపీని ప్రశ్నించారని గుర్తు చేశారు. తీరా కవిత అరెస్ట్ అయ్యాక, కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ లిక్కర్ స్కాం కేసులో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తే ఆ అరెస్ట్ పూర్తిగా అప్రజాస్వామ్యం అంటూ స్టేట్‌మెంట్లు ఇస్తున్నాడని ఆరోపించారు. ఇది ఎవరితో ఎవరికి ఉన్న అనుబంధమో ప్రజలు రానున్న ఎన్నికల్లో తేలుస్తారని అన్నారు. బీఆర్ఎస్ ఇప్పటికే తెలంగాణలో తుడిచిపెట్టుకుపోయిందని, లోక్‌సభ ఎన్నికల తరువాత కారు పార్టీతో పాటు కాంగ్రెస్ కూడా కనుమరుగవ్వడం ఖాయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చనందుకు ప్రజలు కోపంగా ఉన్నారని తెలిపారు. ఆ పార్టీలో నేటికీ నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలే సరిపోయాయని, ఇక పాలనపై ఏం దృష్టి పెడతారంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీని దెబ్బకొట్టేందుకు కేసీఆర్, రేవంత్‌రెడ్డికి మధ్య లోపాయకారి ఒప్పందం జరిగిందంటూ ఆరోపించారు. అసలు నరేంద్ర మోడీకి సరితూగే వ్యక్తి దేశంలో ఏ పార్టీలో లేరని అన్నారు. రాహుల్ గాంధీ ఈ మధ్య చాలా ఫ్రస్టేషన్‌తో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల కంటే ముందే ఓటమికి కాంగ్రెస్ కారణాలను వెతుకుతూ ఎలక్టోరల్ బాండ్లు, ఈవీఎంలను సాకుగా చూపుతున్నారని ధ్వజమెత్తారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి డబుల్ డిజిట్ పక్కా అని లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు.

# వివేకంతో ఓటేసే సమయమిది!



**మొదటి పేజీ తరువాయి**

అందిస్తున్నారా..అంటే అదీలేదు. తమ రాష్ట్రాల్లో నిరంకుశంగా వ్యవహరిస్తూ వస్తున్న ప్రాంతీయ పార్టీలు కేంద్రంపై యుద్దానికి కదిలినా ప్రజలు నమ్మడం లేదు. ఎందుకంటే రాష్ట్రాల్లో ఇష్టం వచ్చినట్లుగా పాలన చేస్తూ...అప్పుల ఊబిలోకి నెడుతూ.. డబ్బుల పందేరాన్ని సంక్షేమం, అభివృద్దిగా చూపస్తున్న పాలకులు తీరును గుర్తించాలి. దేశంలో వివిధ సమస్యలపై ఇప్పటికే లెఫ్ట్ పార్టీలతో పాటు, దాని అనుబంధ సంస్థలు,కార్మిక సంఘాలు వివిధరూపాల్లో పోరాటాలు చేస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో సమస్యలను ఆధారం చేసుకుని ఉద్యమిస్తున్నాయి. అయితే ఆయా రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితుల కారణంగా కొంత వెనకడుగు తప్పడం లేదు. బెంగాల్లో మమతపై పోరాటం చేస్తున్న లెఫ్ట్ పార్టీలకు కాంగ్రెస్‌తో కలసి పోరాడలేక పోతున్నాయి. కేరళలో కూడా అలాంటి పరిస్థితులే ఉన్నాయి. అయితే స్థూలంగా స్థానిక సమస్యలపై పోరాటాలు చేసేలా ఆయా రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవడం ద్వారా పాలకుల దుర్నీతిని ఎండగట్టాలి. ఇప్పుడు ఓటుకాలం కనుక మనం ఆలోచించి ఓటేయాల్సి ఉంది. అయితే ఆయా పార్టీల్లో ఉన్న అనైతకృతను క్యాష్ చేసుకోవాలని బిజెపి చూస్తోంది. విపక్ష పార్టీలు పాలిస్తున్నా రాష్ట్రాల్లో రేతల అవినీతిపై కూడా బిజెపి కాచుకుని కూచుంది. ఇవన్నీ కూడా బిజెపికి కలిసివచ్చేలా ఉన్నాయి. అయితే సమస్యల ఆధారంగా పోరాడాలని వివిధ పార్టీలు ముందుకు వస్తే ప్రజల మద్దతు వస్తుంది. ప్రధానంగా రైతాంగ, కార్మిక సమస్యలపై లెఫ్ట్ అనుబంధ సంస్థలు ముందునుంచీ ఉద్యమిస్తున్నా ఫలితం కానరావడం లేదు. ప్రజలు ఈ సమస్యలపై ఎవరికి వారు అంచనా వేసుకోవాలి. ఎవరికి ఓటు వేస్తే మన జీవితాలు, దేశం పదిలంగా ఉంటుందో ఆలోచన చేయాలి. గతంలో రైతులు ఆందోళనకు దిగి కేంద్రానికి ముచ్చెమటలు పట్టించారు. గతంలో తమిళనాడు రైతులు కూడా ఢిల్లీ వేదికగా ఆందోళను దిగారు. అయితే రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం విఫలమయ్యింది. సాగుచట్టాలను వెనక్కి తీసుకున్నా రైతు సంక్షేమానికి ఒక్క గట్టి నిర్ణయం కూడా తీసుకోలేదు. దీనిని ఆసరగా చేసుకుని రైతులను కలుపుకుని ఉద్యమిం చేందుకు రాజకీయ పార్టీలు ముందుకు వచ్చిన ఆఫలితం దక్కలేదు. ఈ సమస్యలన్నీ పోటీ చేస్తున్న అభ్యర్థుల ముందుంచాలి. మోడీ పదేళ్ల పాలనలో దేశంలోని సామాన్య ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితి దిగజారాయి. దేశంలో 50 శాతంపైబడి ప్రజానీకం వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. అలాంటి వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టబడింది. 2022 నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని ప్రధాని మోడీ ప్రగ్భాలు పలుకుతున్నాడని, కానీ మరోపక్క గత ఏడాదిన్నరలో గ్రామీణ ప్రాంతాల వారి ఆదాయం తగ్గిందని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయని విపక్షాలు గుర్తుచేశారు. దేశంలో 42 శాతం రైతుల ఆత్మహత్యలు పెరిగాయని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను బిజెపి ప్రభుత్వం మరింత దూకుడుగా అమలు చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. దేశంలో రైతుల వద్ద భూములను బలవంతంగా లాక్కొంటున్నారు. నరేగా కేటాయింపులను 50శాతం తగ్గించారని, ఫలితంగా 20 రోజుల మాత్రమే పని ఉంటుందని అన్నారు. దేశంలోని 80 శాతం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులున్నారని, బిజెపి వారిపై దాడి చేస్తోందని విమర్శిస్తున్నారు. రైతులు, కార్మికులు సమస్యలతో సతమతమవుతున్నారని, మోడీ పాలన అన్ని రంగాల్లో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శలు పెరిగాయి. ప్రజాస్వామ్య హక్కులపై దాడి కొనసాగుతోందని, ప్రజలను కుల, మత ప్రాతిపదికన విభజిస్తున్నారు. దేశం మెంత్తంగా తిరోగమనంలో వుందని, అన్ని రంగాలను ధ్వంసం చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. నిరుద్యోగం పెరిగిందని, ఉన్న ఉద్యోగాలు పోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. విద్యా, వైద్యం, ప్రభుత్వ రంగ సంస్థ ప్రైవేటీకరణ చూశారు. కార్పొరేట్ శక్తులను ప్రభుత్వ పాలనలోకి తీసుకొచ్చేందుకు మోడీ తహతహలాడుతున్నారు. మేక్ ఇన్ ఇండియా నినాదంలో పస లేదు.ఉన్న పరిశ్రమలే మూత పడుతున్నాయని మండిపడుతున్నారు. మొత్తంగా దేశంలో ప్రజలందరూ సమస్యలను ఎదుర్కొంటున్నారు. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగం 8 శాతం దాటింది. టోకు ధరల సూచి ఆందోళనకరంగా ఉంది. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి పరిస్థితికి అద్దం పడుతోంది. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారుల మీదకు నెడుతున్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. నిరుద్యోగం మరింత పెరుగుతోంది. ఈక్రమంలో ప్రజలు ఈ సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి. ఎవరు గెలిస్తే మాకేంటన్న ధోరణి నుంచి బయటపడాలి. ఆలోచన చేయాలి. వివేకంతో ఓటేయాలి.

# రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభంకానున్న కేసీఆర్ బస్సు యాత్రలు

**రూట్ మ్యాప్‌పై చర్చించి తుది నిర్ణయం**

**ఎంపీ అభ్యర్థులకు రూ.95 లక్షల చెక్కులు అందజేసిన కేసీఆర్**




హైదరాబాద్, ఏప్రిల్ 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణ భవన్ లో మాజీ సీఎం, అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ ఎంపీ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్‌లతో పాటు జిల్లాల అధ్యక్షులు సమావేశానికి హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల ఖర్చుల నిమిత్తం నియమావళిని అనుసరించి అభ్యర్థులకు కేసీఆర్ రూ.95 లక్షల చెక్కులు అందజేశారు. ఎన్నికల ప్రచారం, వ్యూహాలకు సంబంధించిన సమగ్ర అంశాలపై సమావేశంలో చర్చించారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. కేసీఆర్ బస్సు యాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్‌పై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. అనంతరం ఈ యాత్రలపై అధికారిక ప్రకటన చేయనున్నట్లుగా పార్టీ వర్గాలు తెలిపాయి.

# కవిత అరెస్ట్ పై తొలిసారి స్పందించిన గులాబీ బాస్

**చర్యకు.. ప్రతిచర్య బీజేపి తీరు**

***ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు అంతా ఉత్తిదే***

**ముమ్మాటికి కవిత అరెస్ట్ అక్రమని కీలక వ్యాఖ్యలు**

హైదరాబాద్, ఏప్రిల్ 18 (తీన్మార్ న్యూస్): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో తన కూతురు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ కావడంపై గులాబీ బాస్ కేసీఆర్ తొలిసారి స్పందించారు. తెలంగాణ భవన్‌లో గురువారం జరిగిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు అంతా ఉత్తిదేనని ముమ్మాటికి కవిత అరెస్ట్ అక్రమని కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీజేపీ కీలక నేత బీఎల్ సంతోష్‌ను అరెస్ట్ చేయడానికి మనం పోలీసులను పంపించినామని దీంతో అప్పటి నుండి ప్రధాని మోడీ తనపై కక్ష కట్టారని అన్నారు. అందుకే ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవితను అరెస్ట్ చేసి జైలుకు పంపించాడని కేసీఆర్ ఆరోపించారు. బీఎల్ సంతోష్‌పై మనం కేసు పెట్టకపోతే కవిత అరెస్టు ఉండకపోయేదన్నారు. కవితను కుట్రపూరితంగానే లిక్కర్ కేసులో ఇరికించారని కేసీఆర్ ఆరోపించారు. లిక్కర్ స్కామ్ కేసులో కవిత తప్పు చేసినట్టు 100 రూపాయల ఆధారం కూడా చూపెట్టలేరని అన్నారు. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఎమ్మెల్సీ కవితను ఈడీ మార్చి 15వ తేదీన అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. జ్యుడిషియల్ కస్టడీలో భాగంగా కవిత ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. ఈ క్రమంలో కూతురు అరెస్ట్‌పై కేసీఆర్ నెలదాటిన తర్వాత నోరు విప్పడం గమనార్హం.

# సిద్దిపేట నుండి రైతుల పోస్టు కార్డు ఉద్యమం

**ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతున్న రైతులు**

**రైతుల హామీలను అమలు చేయాలని రేవంత్ రెడ్డికి లేఖలు**



సిద్దిపేట, ఏప్రిల్ 18 (తీన్మార్ న్యూస్): సిద్దిపేట నుండి రైతులు పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టకార్డుల ద్వారా హామీలు అమలు చేయాలని ప్రజాస్వామ్య పద్దతిలో రైతులు నిరసన తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గానికి చెందిన రైతులు పోస్టకార్డు ఉద్యమం ద్వారా సీఎంకు లేఖ రాశారు. గత ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను రేవంత్ రెడ్డి అమలు చేయాలని చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన రైతులు స్వచ్ఛందంగా సీఎం రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డు ద్వారా ఉత్తరాలు రాశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రైతు హామీలు అమలు చేయక పోవడమే కాకుండా పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని రైతులు ఆవేదన చెందారు. రైతులకు ఇచ్చిన హామీలు ఖచ్చితంగా అమలు చేసి తీరాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తమ లేఖ ద్వారా గుర్తు చేశారు. వరి ధాన్యానికి ఇస్తానన్న బోనస్ రూ.500, రైతు భరోసా రూ.10వేలకి బదులు రూ.15వేలు ఇవ్వాలని రైతులు కోరారు. రైతు కూలీలకు ఇస్తానన్న రూ.12వేలు చెల్లించాలని.. రైతు రుణమాఫీ రూ.2 లక్షలు మాఫీతో పాటు రైతు భీమా, వర్షాలు రాక ఎండిపోయిన పంటలకు నష్టపరిహారంగా రూ.25వేలు చెల్లించాలి రైతులు లేఖలో పేర్కొన్నారు.

# ఇంటర్ ఫలితాల విడుదలకు ఇంటర్ బోర్డు నిర్ణయం

**మొదటి పేజీ తరువాయి**

విడుదలకు ముహూర్తం ఖరారు అయినట్లు సమాచారం. ఈ నెల 23వ తేదీన తెలంగాణ ఇంటర్ ఫలితాలను విడుదల చేసేందుకు ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం అందుతుంది. ఒకవేళ ఏదైనా టెక్నికల్ ఇష్యూస్ జరిగితే ఈ నెల 24వ తేదీన ఫలితాలను విడుదల చేస్తామని ఇంటర్ అధికారులు ఓ నిర్ణయానికి వచ్చారట. ఈనెల 25వ తేదీన జేఈఈ మెయిన్ ర్యాంకులు విడుదలవుతున్న నేపథ్యంలో ఇంటర్ ఫలితాలను 23వ తేదీ లేదా 24వ తేదీన రిలీజ్ చేస్తే బాగుంటుందని ఓ నిర్ణయానికి వచ్చిందట ఇంటర్ బోర్డు. దీనిపై రెండు రోజుల్లో క్లారిటీ రానుంది. ఏదేమైనా ఇంటర్ బోర్డు దీనిపై అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

# డీఎస్సీ పోటీ పరీక్ష అభ్యర్ధులకు మరో అప్డేట్

**మొదటి పేజీ తరువాయి**

కొనసాగిస్తున్నారు. విద్య, వైద్య, మహిళాభివృద్ధి, రైతు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇటీవల మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కూడా రిలీజ్ చేశారు. తాజాగా డీఎస్సీ అభ్యర్థులకు మరో గుడ్ న్యూస్ చెప్పింది తెలంగాణ సర్కార్. వివరాల్లోకి వెళితే ఇటీవల తెలంగాణలో టీఎస్ డీఎస్సీ నోటిఫికేషన్ 2024 విడుదల చేసిన విషయం తెలిసిందే. మొత్తం 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తెలంగాణ సర్కార్ మెగా నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. వీటిలో ఎస్జీటీలు 6,508, స్కూల్ అసిస్టెంట్ 2,629, భాషా పండితులు 727, పీఈటీలు 182, ప్రత్యేక కేటగిరిలో స్కూల్ అసిస్టెంట్స్ 220, ఎస్జీటీలు 796 పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు మార్చి 4 వ తేదీ వరకు దరఖాస్తు ప్రక్రియ మార్చి 4 నుంచి ప్రారంభం అయ్యింది. ఏప్రిల్ 3 వరకు దరఖాస్తుల స్వీకరణం ఉంటుందని తెలిపారు.. అయితే ఫీజు చెల్లింపు గడువు విషయంలో విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం.. జూన్ 20వ తేదీ వరకు ఛాన్స్ కల్పించిన విషయం తెలిసిందే. తాజాగా డీఎస్సీ అభ్యర్థులకు టీ సర్కార్ మరో గుడ్ న్యూస్ చెప్పింది. జూలై మాసంలో నిర్వహించబోయే డీఎస్సీ పోటీ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు సువర్ణావకాశం. డీఎస్సీ అభ్యర్థుల కోసం టీశాట్ ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీశాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఏప్రిల్ 17న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్లాసులు ఏప్రిల్ 18 నుంచి 9 రోజుల పాటు జరగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ప్రత్యక్ష ప్రసారాలు ఉంటాయని టీశాట్ తెలిపింది. మ్యాథ్స్, సైన్స్, కెమిస్ట్రీ, బాయలజీ, ఇంగ్లీష్ తదితర సబ్జెక్ట్ లపై లైవ్ ప్రోగ్రామ్ టెలికాస్ట్ అవుతాయని తెలిపారు. ఆ లైవ్ టెలికాస్ట్ ప్రోగ్రామ్స్ మరుసటి రోజు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో రీ టెలికాస్ట్ అవుతాయని వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. డీఎస్సీ పోటీ పరీక్షలకు రాసే అభ్యర్థులు తమ సందేహాలను ఫోన్ కాల్ ద్వారా కూడా నివృతి చేసుకునే అవకాశం కల్పించాని ఆయన అన్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# వ్యక్తిగత స్వేచ్ఛ ఎండమావేనా

రాజకీయాల్లో పార్టీల వ్యూహాలు అనూహ్యంగా మారుతున్నాయి. ప్రత్యర్థులను, విపక్షాలను కట్టడి చేయడానికి అధికార పార్టీలు ఫోన్ ట్యాపింగ్‌ను బ్రహ్మాస్త్రంగా మార్చుకుంటున్నాయి. దేశంలోనే కాకుండా ప్రపంచంలో కూడా ఫోన్ ట్యాపింగ్‌కు కూలిపోయిన రాజ్యాలు, రాజ్యాధినేతలున్నారు. ఈ పార్టీ, ఆ పార్టీ అనే భేదం లేకుండా అధికారంలో ఉన్న పార్టీలన్నీ తన బలాన్ని ప్రజాభిమానంతో పెంచుకోవడం కన్నా ప్రత్యర్థుల కదలికలను, వ్యూహాలను ఫోన్ ట్యాపింగ్‌తో తెలుసుకుని కౌంటర్‌గా వ్యూహాలు అమలు చేయడంతో పాటు ప్రత్యర్థులను లేదా తస్మదీయులపై కేసులు పెట్టడం కూడా సరికొత్త రాజనీతిగా కనిపిస్తున్నది. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలను 'టెలిఫోన్ ట్యాపిం గ్' కుదిపివేస్తున్నది. పదేళ్లుగా అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్‌ను ఎదుర్కోవడానికి కాంగ్రెస్, బిజెపిలు 'టెలిఫోన్ ట్యాపింగ్' ను ప్రధాన ఆయుధంగా మార్చుకోవడంతో లోక్‌సభ ఎన్నికల ముందు ఇదే ప్రధానాంశంగా మారింది. ప్రజల్లో కూడా చర్చనీయాంశమైంది. అగ్ర రాజ్యంగా పేరు పొందిన అమెరికాలో 1974లోనే ఫోన్ ట్యాపింగ్‌లో అప్పటి అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ నేరారోపణ రుజువు కావడంతో తన పదవికి రాజీనామా చేశారు. ఇది వాటర్ గేట్ కుంభకోణంగా ప్రపంచ వ్యాప్తంగా చరిత్రకెక్కింది. దేశంలో కూడా గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటకలలో అధికార పార్టీలు తమ ప్రత్యర్థులపై నిఘాను అనధికారికంగా అమలు చేసి అప్రతిష్ఠపాలయ్యారు. ముఖ్యంగా కర్నాటకలో అప్పటి ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డే తన ప్రధాన ప్రతర్థి దేవగౌడపై టెలిఫోన్ ట్యాపింగ్ చేసి ఆధారాలతో సహా దొరికిపోయి నైతిక బాధ్యతగా రాజీనామా చేశారు. చరిత్రలో ఇలాంటివి అనేక రాష్ట్రాల్లో, దేశాల్లో జరుగుతున్నా బయటికి వచ్చేవి కొన్ని మాత్రమే. గతంలో ప్రభుత్వాలు, రాజ్యాధినేతలు టెలిఫోన్ ట్యాపింగ్‌లో ఇరుక్కుపోయిన చేదు అనుభవాలున్నా రాజ్యాధినేతలు టెలిఫోన్ ట్యాపింగ్‌నే ఆయుధంగా మార్చుకోవడం ఆధునిక రాజ్యనీతిగా మారింది. ప్రస్తుతం తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తున్న టెలిఫోన్ ట్యాపింగ్ రోజుకో మలుపు తిరుగుతున్నది. సీనియర్ పోలీసు అధికారులు సహా అనేక మంది రాజకీయ నేతలు పేర్లు కూడా బయటికి వస్తున్నాయి. అయితే ఇవి సాక్షాధారాలతో ఎలా రుజువు అవుతాయనేది ఇప్పుడే చెప్పలేకున్నా అసలు టెలిగ్రాఫిక్ చట్టం ప్రకారం టెలిఫోన్‌ను ట్యాప్ చేయడం నేరం. దీనికి తగిన శిక్షలున్నాయి. రాజకీయ నేతలెవరికీ ఈ చట్టం ప్రకారం శిక్షలు పడలేదు. ఇండియన్ టెలిగ్రాఫిక్ యాక్ట్ సెక్షన్ 5(2) ప్రకారం ఇతరుల ల్యాండ్ లేదా మొబైల్ ఫోన్ సంభాషణలు వినడం నేరం. ఇది వ్యక్తిగత స్వేచ్ఛకు పూర్తిగా భంగకరం. దేశ రక్షణ, సమగ్రత, సార్వభౌమాధికారానికి ప్రమాదం ఏర్పడిన అరుదైన సందర్భాలలోనే ట్యాపింగ్‌ను అనుమతిస్తారు. అది కూడా కేంద్ర, రాష్ట్ర హోం సెక్రటరీలు అనుమతించాలి. ట్యాపింగ్‌కు అనుమతి అవసరమనుకుంటే హోం సెక్రటరీలు తొలుత 2 నెలలకే అనుమతిస్తూ ట్యాపింగ్ ఆర్డర్ ఇస్తారు. అది ప్రత్యేక పరిస్థితిలో 6 నెలలకు మించకూడదు. దీనిని నియంత్రించ డానికి ప్రత్యేక రివ్యూ కమిటీ కూడా ఉంటుంది. దీనికి తోడు సుప్రీం కోర్టు కూడా పలు సందర్భాల్లో టెలిఫోన్ ట్యాపింగ్ చట్ట అనుమతి దుర్వినియోగం కాకుండా అనేక పరిమితులు కూడా విధించింది.దేశంలో అనేక రాష్ట్రాల్లో ట్యాపింగ్ అనేది అధికార పార్టీ చేతిలో బ్రహ్మాస్త్రంగా మారింది. నేటి ప్రధాని నాటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ గుజరాత్ రాష్ట్రంలో కూడా టెలిఫోన్ ట్యాపింగ్‌ను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఆ రాష్ట్రంలో ఒక మహిళ టెలిఫోన్‌ను ట్యాప్ చేశారని అప్పట్లో రాజకీయ ప్రకంపనలు చెలరేగాయి. ట్యాపింగ్‌లో కూడా ఆధునికత చోటు చేసుకున్నది. టెక్నాలజీ పెరుగుదలతో పాటు సంభాషణలు వినే రికార్డు చేసే అత్యాధునిక సామగ్రి ప్రపంచ విపణిలో సులభంగా దొరుకుతున్నది. ముఖ్యంగా ఇజ్రాయెల్ దేశం పెగాసస్ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా టెలిఫోన్ ట్యాపింగ్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తున్నదని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతున్నది.కాని అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో టెలిఫోన్ ట్యాపింగ్‌ను నియంత్రించే ప్రత్యేక చట్టాలు ఎవరూ చేయడం లేదు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో 100,000 కంటే ఎక్కువ ఫోన్ కాల్స్ అక్రమంగా ట్యాప్ చేయబడినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఇందులో ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు, భారతీయ జనతా పార్టీ (బిజెపి), కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నాయకులు, రియాల్టర్లు, ప్రముఖ నేతల ఫోన్లు ట్యాప్ చేసినట్టు తెలుస్తోంది. అలాగే.. సినీ, వ్యాపార ప్రముఖులను బ్లాక్ మెయిల్ చేసి.. వారి నుంచి భారీ మొత్తంలో డబ్బులు దోచుకున్నట్టు ఆరోపణలున్నాయి. ట్యాపింగ్ ఆరోపణలు ఆధారాలతో సహా రుజువు కాకపోవడంతో ఎవరికీ శిక్షలు పడడం లేదు. ఈ చట్టం అంటే భయం కూడా ఎక్కడా లేదు. అందుకే ఎవరు అధికారంలో ఉన్నా ప్రత్యర్థులపై ట్యాపింగ్ వాడుకోవడం షరా మామూలుగా మారింది. వ్యక్తుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించే ఈ పెడ ధోరణులను అరికట్టే విశాల హృదయమున్న పాలకులెవరో చూడాలి.

# ఆశీర్వదించండి... సేవకుడిగా పని చేస్తా....

**– దేశ రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి**

**– సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు మహబూబ్నగర్ పార్లమెంటు అభ్యర్థి చల్లా వంశీ చందర్ రెడ్డి**





ఆత్మకూర్, ఏప్రిల్ 18(తీన్మార్ న్యూస్): మక్తల్ నియోజకవర్గ పరిధిలోని నర్వ మండల కేంద్రంలో నర్వ మండల కాంగ్రెస్ అధ్యక్షులు చెన్నయ్య సాగర్ అధ్యక్షతన నర్వ మండల మరియు పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి గురువారం రోజు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మహబూబ్నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెల్లా వంశీచందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వార్థ రాజకీయాల కోసం కల్లో సరాయి అమ్మే వాళ్ళు రామ భజన తో ప్రజలను మోసం చేయడానికి మరోసారి ముందుకు వస్తున్నారని అలాంటి వాళ్లను నమ్మవద్దని ఆయన హితో పలికారు. ప్రజలకు ప్రాజెక్టులు కట్టే వాళ్లు కావాలా సారాకల్లో దందా వచ్చేసేవాళ్ళు కావాలా ప్రజలు నిర్ణయించుకోవాలని ఆయన సూచించారు. కేంద్రంలో ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీని చూడాలని అదేవిధంగా పార్లమెంట్ అభ్యర్థి వంశీ చందర్ రెడ్డిని చూడడానికి మీ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. మనం ఏం చేస్తున్నామో మన ప్రభుత్వం ఏం చేస్తున్నది మన ముఖ్యమంత్రి ఏం చేస్తున్నది ప్రజలకు ప్రతి ఒక్కరికి తెలియ చెప్పాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం రాష్ట్రంలో దేశంలో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీకి ముగ్గు చూపుతున్నారని కాబట్టి ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త రాబోయే ఎన్నికల్లో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ కల్లుగీత కార్మిక సెల్ అధ్యక్షులు కేశం నాగరాజు గౌడ్, మక్తల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు బికేఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణ గౌడ్, టీపీసీసీ సెల్ కోర్ కమిటీ సభ్యులు ఎన్ఆర్ఐ పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, టిపిసిసి ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ బంగ్లా శ్రీకాంత్ రెడ్డి, నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు జలంధర్ రెడ్డి, నారాయణపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి, మహబూబ్నగర్ జడ్పీ చైర్పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, నర్వ జడ్పిటిసి జ్యోతి కిరణ్ ప్రకాష్ రెడ్డి, నర్వ మండల కాంగ్రెస్ అధ్యక్షులు చెన్నయ్య సాగర్, నర్వ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, నర్వ మండల ఎంపిటిసి యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు నీరజ్, నర్వ కాంగ్రెస్ నాయకులు వివేకవర్ధన్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప రెడ్డి మరియు నర్వ మండల వివిధ హెూదా నాయకులు, ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మండల అధ్యక్షులు ఎండి రహమతుల, నర్వ వివిధ మండలాల గ్రామాల అధ్యక్షులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మొజర్ల మద్దిగట్ల గ్రామాలను సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి రమణమూర్తి







వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, ఏప్రిల్ 18(తీన్మార్ న్యూస్): మండల పరిధిలోని మొజర్ల మద్దిగట్ల గ్రామాలలో గురువారం జిల్లా పంచాయతీ అధికారి రమణమూర్తి సందర్శించారు. గ్రామాలలో మిషన్ భగీరథ త్రాగునీరు అంతంత మాత్రాన వస్తుండడంతో త్రాగునీటి సమస్యపై పరిశీలించారు సమస్య లేకుండా ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టాలని వారు అధికారులకు సూచించారు గ్రామాలలో ప్రజలకు మంచినీటి సమస్య సరఫరా ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు గ్రామ పంచాయతీకి సంబంధించిన మంచినీటి బోర్ల బావులను పరిశీలించారు. మంచినీటి ఇబ్బంది ఉన్నచోట గ్రామాలలో బోర్ల మోటర్ మరమ్మత్తు చేపట్టాలని అన్నారు. గ్రామాలలో ఎక్కడ మంచి నీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు.

గ్రామపంచాయతీ చేసిన పనులను ఎప్పటికప్పుడు రికార్డులు నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీరామ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలల్లో సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులు

**– అన్ని రకాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి**

**– మృతి చెందిన ప్రశాంత్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలి**

**– ఎంవి ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ అర్.వెంకట్ రెడ్డి**



భువనగిరి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 18(తీన్మార్ న్యూస్): కేంద్రంలోని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల హాస్టల్లో ఫుడ్ పాయిజన్ కు గురై 6వ తరగతి చదువుచున్న విద్యార్థి సీహెచ్ ప్రశాంత్(12) గత ఆరు రోజులుగా చికిత్స పొందుతూ మృతిచెందడం అత్యంత బాధాకరమైన విషయని, ఎం వి ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్. వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం పోచంపల్లి మండలం, జిబ్లక్ పల్లి గ్రామంలో ప్రశాంత్ తల్లిదండ్రులను, తాత, నానమ్మ, అమ్మమ్మ, మేనమామలను కలిసి ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న రాత్రి హాస్టల్లో ఫుడ్ పాయిజన్ కావడంతో ఇప్పటివరకు 27 మంది విద్యార్థులు అస్వస్థ తకు గురయ్యారని, ఐతే గమనించాల్సిన విషయం ఏమిటంటే భువనగిరి గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటన తెలంగాణా రాష్ట్రం లో మొదటిదీ కాదు చివరిదీ కాదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం లో సుమారు 982 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల గురుకుల పాఠశాలల్లో దాదాపు 5,58,923 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని ఆయన తెలిపారు.హాకొన్ని గురుకులాల దుస్థితి, విద్యార్థుల పరిస్థితి మరీ దయనీయమైన స్థితిలో ఉన్నాయని,అట్టహాసంగా గురుకులాలు ఏర్పాటు చేయడం, ఉన్న వాటిని జూనియర్ కాలేజీలుగా అఫ్ గ్రేడ్ చేయడం చేసారు కానీ ఉపాధ్యాయు లను నియమించే ప్రక్రియను, మౌలిక వసతుల కల్పన ను గాలికి వదిలి వేసారని ఆయన ఆరోపించారు. అత్యధిక శాతం గురుకులాలు ప్రైవేటు భవనాలలో కొన్ని జిల్లాల్లో రెండు మూడు గురుకులాలు ఒకే భవనంలో నిర్వహిస్తున్నారని, వసతుల విషయంలో కానీ భోజన విషయంలో కానీ నిర్ణయించిన ప్రమాణాలు పాటించ కుండా రాష్ట్ర వ్యాప్తంగా వేల మంది విద్యార్థులు అస్వస్థకు గురైన వారు కొందరైతే, కొంత మంది ప్రాణాలు విడిచిన వారు ఉన్నారని ఆయన అన్నారు. విద్యార్థుల భోజన నాణ్యతా మీద కానీ, నాణ్యమైన విద్య అందించడంలో కానీ, తల్లిదండ్రులు బయటి వారికి ఎవ్వరికీ కూడా ఫిర్యాదు చేయవద్దని చేసిన వారికి టిసి లు ఇచ్చి పంపి వేస్తామని గురుకుల పాఠశాలల సిబ్బంది చే బెదరింపులు, అంతే కాకుండా ఈ విషయాలు అడిగిన పిల్లలను శారీకంగా హింసకు గురి చేసిన సంఘటనలు కూడా నిత్యం జరుగుతున్నాయని ఆయన అన్నారు. గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనను గాలికి వదిలి వేసారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 76% గురుకులాలు అర కొర వసతులతో అద్దె భవనాలలో నడుస్తున్నా యని ( బి. సి 119 కి 103, మైనారిటీ 204 కు 190 ,SC: 238 కు 136 అద్దె భవనాలలో). కే జీ బి వి లల్లో ఉన్న 1,00,536 ఆడ పిల్లలు మౌలిక సదుపాయాలు లేక చాల ఇబ్బందుల్లో ఉన్నారని ఆయన తెలిపారు. రోజుకు మూడు పూటలు భోజనానికి కలిపి మొత్తం 30 రూపాయలు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం నాణ్యమైన పోషక ఆహారాన్ని అందించేందుకు బడ్జెట్‌ను పెంచాలని, మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు వేయాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సంక్షేమ హాస్టళ్లలో అనుసరించాల్సిన ప్రమాణాలపై నిర్దిష్టమైన విధి విధానాలు రూపొందిం చాలని, అవి ఖచ్చితంగా అమలు అయ్యేలా తగిన పర్యవేక్ష ణా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, ప్రత్యేక కమిషన్ ను వేసి గురుకుల పాఠశాలల తీరును పర్యవేక్షించాలని, ముఖ్యమంత్రి స్థాయిలో సమీక్షలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఆయన వెంట బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకులు కొడారి వెంకటేష్, సామాజిక ఉ ద్యమ నాయకురాలు బుద్ధుల సునీత లు ఉన్నారు.



# మృతురాలి కుటుంబానికి ఇంజ నరేష్ ఆర్థిక సహాయం



రాజాపేట, ఏప్రిల్ 18(తీన్మార్ న్యూస్): రాజపేట మండలం, కాల్వపల్లి గ్రామంలో విద్యుత్ షాక్ తో మృతి చెందిన కాకల్ల చంద్రకళ కుటుంబానికి గురువారం ఇంజ నరేష్ రూ.5,000/- రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కళ్లెం పాండు, ఇంజ శ్రీరాములు, చేర్యాల నాగయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కాకల్ల శ్రీకాంత్, ఇంజ స్టీవేన్, కాకల్ల శ్రీకాంత్ , కాకల్ల స్వామి, కళ్ళెం రామస్వామి, ఇంజ మహేష్, చేక్రాల బాబు,పేంట శ్రీను, అంజయ్య, ఇంజ నానీ, జేయంత్, ఇంజ కర్ణాకర్, పవన్, కార్తీక్, అజిత్, సంజయ్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రాజపేట మండల బిఆర్ఎస్ అధ్యక్ష పదవి మాదిగలకు కేటాయించాలి



రాజాపేట, ఏప్రిల్ 18(తీన్మార్ న్యూస్): రాజపేట మండల బిఆర్ఎస్ మండల అధ్యక్ష పదవిని మాదిగల కు కేటాయించాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు వోతుక్కుపల్లి ప్రవీణ్ కోరారు. గురువారం రాజపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు మండల పార్టీ ఏనాడు కేటాయించలేదని ఈసారి మాదిగలకు పదవి కేటాయిస్తే మాదిగ జాతి అంతా బిఆర్ఎస్ వైపే ఉంటారన్నారు. అధిష్టానం ఆలోచించి పదవి మాదిగల కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

# శ్రీరాముడు చిత్రపటాలు పంపిణీ చేసిన బీజేపీ నాయకుడు కారింగు రాజు గౌడ్



మంచాల, ఏప్రిల్ 18(తీన్మార్ న్యూస్): మంచాల మండలం, లోయపల్లి గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా బిజెపి నాయకులు కారింగు రాజు గౌడ్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలకు శ్రీరాముడు యొక్క చిత్రపటాలు పంపిణీ చేశారు. ఈ యొక్క కార్యక్రమం లో గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మంచం గుర్తు కు ఓటు వేయండి అభివృద్ధి చేసి చూపిస్తాం

**– ఎంపీ అభ్యర్థి పెంట రమేష్**



రాజపేట, ఎప్రిల్ 18(తీన్మార్ న్యూస్): బహుజన్ ముక్తి పార్టీ మంచం గుర్తుకు ఓటు వేయమని అభివృద్ధి చేసి చూపిస్తామని భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం బీఎంపి అభ్యర్థి పెంట రమేష్ అన్నారు. తుర్కపల్లి మండలం లోని వీరారెడ్డిపల్లి లో ఇంటింటికి మంచం గుర్తును పరిచయం చేస్తూ పురవీధులలో తిరుగుతూ ఓటరులను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి, కాంగ్రెస్ పాలనలో అగ్రకులాలకే పెద్దపీట వేశారని బీసీ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాలను అణిచివేశారని ఆయన అన్నారు. బిజెపీ ప్రభుత్వం 55 శాతం ఉన్న ఓబిసి 27శాతం రిజర్వేషన్లు, 10 శాతం ఉన్న అగ్రవర్ణల 10 శాతం రిజర్వేషన్లు కల్పించి. ఓబిసిఇ లకు అన్యాయం వేసిందన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మంచం గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

# మాదిగల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారు

**- బాధతో మాజీ మంత్రి మోత్కుపల్లి కంటతడి**
**- పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ ఒక్క సీటు మాదిగలకు కేటాయించలేదని ఆయన నివాసంలో దీక్ష చేపట్టిన మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింలు**
**- ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల మద్దతు**





హైదరాబాద్, ఏప్రిల్ 18(తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసే విధంగా వ్యవహరించడంతో ఎంతో బాధతో కంటతడి పెడుతూ దీక్ష చేస్తున్నానని మాజీ మంత్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోత్కుపల్లి నర్సింహులు ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క సీటు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ హైదరాబాద్ బేగంపేట తన నివాసంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మోత్కుపల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క పార్లమెంట్ సీటు కూడా ఇవ్వకపోవడం బాధాకరం అని కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరు మాదిగలకు చాలా అవమానకరంగా ఉందన్నారు. మాదిగలకు పార్లమెంట్ టికెట్లు ఇవ్వకపోవడంతో మా జాతి 50 ఏళ్ళు వెనుకకు పోతుందన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీ బతికి బట్ట కట్టిందంటే దానికి మాదిగ జాతి ఏ కారణం అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో మాదిగలకు మంత్రి పదవులు ఇవ్వకపోవడంతో ఆ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి కాంగ్రెస్ కు మద్దతు పలికి అధికారం కట్టబెట్టారన్నారు. రేవంత్ రెడ్డి సీఎం కావాలని ముందు గళమెత్తిది నేనేనని నా పిలుపుతో రాష్ట్రంలో మాదిగలు అందరూ కాంగ్రెస్ కు ఓటు వేసి గెలిపించారు. ఎందుకు మాదిగలకు టికెట్ ఇవ్వలేదో రేవంత్ రెడ్డి చెప్పాలి. పార్లమెంట్ కు మా మాదిగ జాతి పోవొద్దా అని ప్రశ్నించారు. మా జాతి నోరు లేని అమాయకపు జాతి అని అందుకే అవమానం చేస్తున్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి మాదిగలను పిలిచి సమస్య పరిష్కారం చేస్తే బాగుంటుందని సూచించారు. ఈ దీక్ష పార్టీ వ్యతిరేకం కాదు అని మా జాతి ఉనికి కోసం దీక్ష చేస్తున్నానని తేల్చి చెప్పారు. పదవులపై తనకు ఎలాంటి ఆశ లేదని రాష్ట్రంలో 80 లక్షల మంది ఉన్న మాదిగలకు ఒక్క సీటు ఇవ్వకపోవడం ఎంతో బాధాకరమని వెంటనే రేవంత్ రెడ్డి ఆలోచించి మాదిగలకు పార్లమెంట్ సీటు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మాదిగలం దూరం చేస్తే పార్టీకి తీవ్ర నష్టం పాటిస్తుందని హెచ్చరించారు. మోత్కుపల్లి దీక్షకు ఎమ్మార్పీఎస్ నాయకులు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విహెచ్ హనుమంతరావు, మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణ దీక్షకు మద్దతు పలికి నిమ్మరసం అందించి దీక్షను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గిరెడ్డి ముకుంద రెడ్డి, ఎస్.ప్రసాద్, సిల్వేరు సుధాకర్ రెడ్డి, పాండవుల భాను ప్రకాష్ గౌడ్, ఠాకూర్ ప్రమోద్ సింగ్, పల్లె కృష్ణ గౌడ్, మోత్కుపల్లి రవి, కె.వి రమణ, లక్ష్మణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# యండి జహంగీర్ భారీ మెజార్టీ తో గెలిపించాలి

**- సిపిఐ (ఎం) పార్టీ మండల కమిటీ సభ్యులు కత్తుల లింగస్వామి**



చిట్యాల, ఏప్రిల్ 18(తీన్మార్ న్యూస్): భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం సిపిఐ (ఎం) పార్టీ అభ్యర్థి కామ్రేడ్ యండి జహంగీర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఐ(ఎం) పార్టీ చిట్యాల మండల కమిటీ సభ్యులు కత్తుల లింగస్వామి ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం నాడు జహంగీర్ గెలుపు కోరుతూ చిట్యాల మండలం సుంకనపల్లి గ్రామంలో సిపిఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంత రైతాంగం కోసం ఫిలాయిపల్లి కాలువ నిర్మాణం కోసం సిపిఐ (ఎం) పార్టీ ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్లుగా ధర్నాలు, నిరాహార దీక్షలు, ఉద్యమాలు, ప్రజా ప్రతినిధులపై ప్రత్యక్ష పోరాటాలు నిర్వహించడం జరిగిందని, జహంగీర్ నాయకత్వాన ఫిలాయిపల్లి నుండి నల్లగొండ వరకు పాదయాత్ర చేసి ప్రభుత్వాలపై ఒత్తిడి చేసి పిలాయిపల్లి కాలువను సాధించుకున్న ఘనత సిపిఐ (ఎం) పార్టీ దేననీ తెలిపారు. బిజెపి, కాంగ్రెస్, టీఆర్ఎస్ లాంటి పార్టీలన్నీ ప్రైవేటీకరణ విధానాలను అమలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా బడా కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెడుతున్నారని, ఒకవైపు అంబానీ, ఆదానీలకు ప్రభుత్వ సంస్థలను కట్టబెడుతూనే మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ బిజెపి ప్రజల మధ్య చిచ్చు పెడుతుందని, మతాన్ని అడ్డుపెట్టుకొని ఓట్లు రాబట్టాలని పన్నాగాలు పన్నుతున్నారని, డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ వంటి నిత్యవసర దరలను విచ్చలవిడిగా మోయరాని భారాలతో పేదల నడుములు విరగ్గొడుతున్నారని, మతాన్ని, దేవుడిని అడ్డంపెట్టుకొని ఓట్లు గుంజుకుంటుందని, ప్రజా వ్యతిరేక బిజెపి, కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం) పార్టీ సుంకనపల్లి గ్రామ శాఖ కార్యదర్శి పంతంగి నరసింహచారి, కొసనం లింగారెడ్డి, చిట్టిప్రోలు జనమే జయ, కత్తుల నరసింహ, యాదయ్య, బిక్షపతి, మల్లయ్య, శ్రీరాములు, ఐలయ్య, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారతే బిజెపి లక్ష్యం

**- మోడీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం**
**- మోడీ వస్తే దేశం మరో 10 ఏళ్లు ముందుకు వెళుతుంది**



తెక్మాల్, ఏప్రిల్ 18(తీన్మార్ న్యూస్): మహిళా సాధికారతే బిజెపి లక్ష్యంగా పనిచేస్తుందని బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పల్వంచలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి సమ్మేళనం లో ఆమె మాట్లాడుతూ దేశంలో మోడీ హయాంలో చేసిన అభివృద్ధి పనులను చూసి బిజెపికి ఓటు వేయాలని కోరారు. ఆవాస్ యోజన కింద నాలుగు కోట్ల మంది పేద ప్రజలకు ఇల్లు నిర్మాణం స్వచ్ఛభారత్ పథకం కింద ఇంటింటికి మరుగుదొడ్లు నిర్మాణం, ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఉచిత రేషన్ బియ్యం సరఫరా లాంటి పథకాలతో అనునిత్యం ప్రజలకు అందిస్తున్నారని ఆమె అన్నారు. మహిళలకు రాజకీయపరంగా ఎదగాలని ఉద్దేశంతో మహిళా మోర్చా విభాగాన్ని ప్రవేశపెట్టి మహిళలకు రాజకీయ అనుభవాన్ని కల్పిస్తున్నారని అన్నారు. మహిళలకు 33% రిజర్వేషన్, కేంద్ర మంత్రిత్వ శాఖలో నిర్మల సీతారామన్ ఆర్థిక శాఖ కేటాయించి మహిళలకు దేశాన్ని నడిపే సత్తా ఉందని నిరూపించారన్నారు. గత దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ చేయలేని అభివృద్ధి పనులు మోడీ చేసి చూపించారని టెక్నాలజీలో గత పది సంవత్సరాలో టెక్నాలజీని ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బిజెపి ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్, జహీరాబాద్ బిజెపి పార్టీ కో కన్వీనర్ శోభారాణి, రాష్ట్ర మహిళా నాయకులు సుధా, శ్రీలత, వచన పాటిల్, కామారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులుఅరుణతార, సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, టేక్మాల్ మండల అధ్యక్షులు నవీన్ గుప్తా, ప్రధాన కార్యదర్శి సిద్దిరాములు, శ్యామయ్య, ఎల్లుపేట రాజు, రెడ్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థులపై ఎబివిపి గుండాల దాడిని ఖండించండి

**- వరుసగా విద్యార్థులపై దాడులు చేస్తూ క్యాంపస్ ను విధ్వంసం సృష్టిస్తున్న ఎబివిపి**
**- మహిళా విద్యార్థినీలపై నీచంగా భౌతిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలి**
**- నిందితులను శిక్షించాలని నేడు ఖమ్మం నగర కేంద్రంలో ఏబీవీపీ దిష్టిబొమ్మ దగ్ధం**
**- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి. ప్రవీణ్**

ఖమ్మం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 18(తీన్మార్ న్యూస్): భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కేంద్రంలోని నిర్మల్ హృదయ్ హై స్కూల్ వద్ద ఏబీవీపీ దిష్టిబొమ్మ దగ్నం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ ఈరోజు అర్ధరాత్రి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో విద్యార్థులపై ఎబివిపి గుండాలు దాడికి పాల్పడ్డారు. సుమారు 100 మంది మతోన్మాద మూకలు విద్యార్థులపై దాడి చేశారు. గత రెండు రోజుల క్రితం పిడబ్ల్యూడి విద్యార్థిపై దాడి చేసిన ఎబివిపి చేయలేదని అబద్దాలు ప్రచారం చేసింది. ఎబివిపి అబద్ధాలను ఎస్ఎఫ్ఐ సాక్ష్యాలతో సహా నిరూపించింది, కావాలనే దివ్యాంగ విద్యార్థిపై దాడి చేసిందని నిరుపించడంతో విద్యార్థులలో స్థానం కోల్పోయిన ఎబివిపి







మళ్ళీ దాడికి ప్లాన్ చేసి అర్ధరాత్రి హస్టల్స్ దూరి దాడికి పాల్పడింది. దాడి చేయకుండా అడ్డుకున్న యూనియన్ అధ్యక్షుడు అతీక్, ఎస్ఎఫ్ఐ యూనిట్ కార్యదర్శి కృపాజార్జ్ మరియు మరో 20 మంది విద్యార్థులపై దారుణంగా భౌతిక దాడికి పాల్పడ్డారు. అమ్మాయిలను సైతం జుట్టు పట్టుకుని ఈడ్చి దాడిచేసి గాయపర్చారు. గాయాలపాలైన విద్యార్థులను అంబులెన్స్ ద్వారా హెల్త్ సెంటర్ కు తరలిస్తుంటే అంబులెన్స్ హస్పిటల్ వెళ్ళకుండా అడ్డుకోని అంబులెన్స్ లోని వారిపై దాడికి పాల్పడలని ప్రయత్నం చేశారు. సెక్యూరిటి, ఇతర విద్యార్థులను సైతం భయ భ్రాంతులకు గురిచేస్తూ దాడులు చేశారు. వారికి వారే గాయాలు చేసుకోని ఎస్ఎఫ్ఐ తమపై దాడి చేసిందని అబద్ధాలు నేరేట్ చేస్తున్నారు. ప్రశాంతంగా భిన్న అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హెచ్.సి.యు. క్యాంపస్ లో విద్వేషాలు, దాడులు చేసే సంస్కృతిని ఎబివిపి తీసుకుని వస్తుంది. వరుసగా క్యాంపస్ లో విద్యార్థుల నుండి తిరస్కరణ గురైతున్న ఎబివిపి ఎస్ఎఫ్ఐ పై దాడులు చేసి బెదిరింపులు గురిచేయాలను కుంటుంది. ఎబివిపి దేశంలో యూనివర్శిటీలలో మీరు ఎన్ని దాడులు చేసిన నికరంగా విద్యార్థులు సమస్యలపై పోరాటం చేసేది ఎస్ఎఫ్ఐ అని, ఏబీవీపీ అత్యంత నీచంగా మహీళ విద్యార్థులపై దాడి చేశారు. నిత్యం భారతమాత జై అంటున్న ఎబివిపి మహీళలపై దాడుల చేయడ మేనా మహీళలకు ఇస్తున్న గౌవరం అని పశ్నించారు. ఈ దాడిని విద్యార్థులు,మేధావులు, ప్రజాస్వామిక వాదులు, ఖండించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ కోరుతుంది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సుధాకర్ జిల్లా ఉపాధ్యక్షులు వంకాయల రాజు, నగర ఉపాధ్యక్షులు వినోద్, మనోజ్, మహేష్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నాయకులపై ఏబీవీపీ దాడిని ఖండించండి

**- ఎస్ఎఫ్ఐ ఆలేరు మండల కార్యదర్శి కాసుల నరేష్**




ఆలేరు, ఏప్రిల్ 18(తీన్మార్ న్యూస్): ఆలేరు పట్టణంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నాయకులపై ఏబీవీపీ గుండాలు మద్యం మత్తులో కత్తులతో చేసిన దాడి నీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ ఆలేరు మండల కార్యదర్శి కాసుల నరేష్ తెలిపారు. గురువారం మండల కార్యదర్శి కాసుల నరేష్ మాట్లాడుతూ మొన్న జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికలలో లెఫ్ట్ కూటమి విద్యార్థి సంఘం గెలుపొందిన నేపథ్యంలో జీర్ణించుకోలేక ఏబీవీపీ గుండాలు మద్యం మత్తులో దాడులకు దిగబడ్డారని విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఎండి లతీక్ అహ్మద్, యూనిట్ సెక్రటరీ కృప, జార్జ్ తదితరులపై దాడి చేశారు. మహిళా సహచరులను ఏబీవీపీ గుండాలు దుర్భాషలాడారని మహిళలని చూడకుండా భౌతికంగా దాడులకు పాల్పడ్డారని కేవలం మూడు రోజుల ముందు వారు క్రియాశీల సభ్యుడు హర్షపై దాడి చేశారని ఇప్పుడు వారు ఈ క్రూరమైన హింసకు పాల్పడ్డారని ఎస్ఎఫ్ఐ ఆలేరు మండల కమిటీగా ఈ హింసను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. పోలీసులు సంబంధిత దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కందుల నాగరాజు, కంతి రాజు కుమార్, పుట్టల శ్రీరామ్, కంతి బన్నీ, తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలి

**- బిఎస్పి ఇబ్రహింపట్నం అసెంబ్లీ అధ్యక్షులు గ్యార మల్లేష్**





ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 18(తీన్మార్ న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై మృతి చెందిన ఆరో తరగతి చదువుకునే విద్యార్థి ప్రశాంత్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలని బిఎస్పి ఇబ్రహీంపట్నం అసెంబ్లీ అధ్యక్షులు గ్యార మల్లేష్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల గురుకుల పాఠశాలలో తరచూ ఇలాంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతూనే ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించడం లేదని, ప్రభుత్వాధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి కారణమని అన్నారు. గతంలో ఇదే భువనగిరి గురుకుల పాఠశాలలో ఇద్దరు అమ్మాయిలు చనిపోయారు. అధి మరవక ముందే సూర్యాపేటలో ఇంటర్ చదువుతున్న విద్యార్థి ఆత్మ హత్య చేసుకున్నారు. వీటి అన్నింటికీ కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే అని ఇది ప్రభుత్వంచేసిన హత్యే అని మండిపడ్డారు. చనిపోయిన కుటుంబాన్ని అన్నీ విధాలుగా ఆదుకోవాలని లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం పై బిఎస్పి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు 50 లక్షల ఎక్స్గ్రెషియా ఇవ్వాలి. భవిష్యత్ లో ఇలాంటివి జరగకుండా ఉండాలంటే, ప్రతి గురుకుల పాఠశాలలో ఒక కౌన్సెలింగ్ సైకాలిజిస్ట్ నియమించాలి. నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలి. విద్యా శాఖ మంత్రిని వెంటనే నియమించాలనీ బిఎస్పి పార్టీ తరుపున డిమాండ్ చేశారు.

# వారసత్వ సంపదను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలి




వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, ఏప్రిల్ 18(తీన్మార్ న్యూస్): రాజా రామేశ్వరరావు పాలిటెక్నిక్ భవనాన్ని కాపాడడానికి మూడు సంవత్సరాలుగా చేస్తున్న పోరాటం ఫలించి గత ప్రభుత్వంలో 22 కోట్లు మంజూరు కావడానికి స్వాగతిస్తూ వచ్చిన ప్రభుత్వం జీవో నెంబర్ మార్చి మళ్లీ 22 కోట్లు ఇవ్వడానికి కూడా స్వాగతిస్తున్నాము కానీ ఇంతవరకు ప్రారంభం కానీ పనుల వల్ల రాబోకాలంలో ఆ భవనానికి జరిగే నష్టం ఊహించనిది కనుక వెంటనే ప్రారంభించి భవనాన్ని కాపాడాలని అఖిలపక్ష ఐక్యవేదిక కోరుతుంది. ఈ రోజు ప్రపంచ వారసత్వ కట్టడాల దినోత్సవ సందర్భంగా, పాలిటెక్నిక్ కలాశాలకు చేరుకొని అక్కడి కట్టడాలను పరిశీలించి శాంక్షన్ అయిన 22 కోట్ల నిధులను వెంటనే పిలిచి భవనం మరమ్మత్తు వెంటనే ప్రారంభించాలని పాలిటెక్నిక్ భవనాన్ని కాపాడాలని అఖిలపక్ష ఐక్య వేదిక కోరింది. అలాగే గతంలో ఉన్న పాలిటెక్నిక్ హాస్టల్ భవనాలను మరమ్మత్తులు చేసి కొత్త భవనం ప్రారంభం అయ్యే వరకు విద్యార్థులకు ఆ పాత భవనాలను కేటాయించాలని అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేశారు. ఎందుకంటే తెలంగాణలోనే అతిపెద్దదైన వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు వసతి గృహాలు లేక బయట మూడువేల నుండి 5000 వరకు జల్లించి ప్రైవేటు వసతి గృహాలలో ఉండ డాన్ని ఖండిస్తున్నాము. వచ్చే అకాడమీక్ ఇయర్లో విద్యార్థులను వసతి గృహాలకు అనుమతి ఇవ్వాలని ఈరోజు అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేస్తున్నది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సతీష్ సతీష్ యాదవ్ తో పాటు శివకుమార్, భాస్కర్, దేవేందర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓవైపు ఉక్కపోత..మరోవైపు వడదెబ్బ..

**- 45 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు**
**- మరో రెండు, మూడు డిగ్రీలు పెరిగే అవకాశం**
**- హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ**
**- ఎండకు తాళలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు**
**- పలు జిల్లాల్లో కురిసిన వర్షం**

హైదరాబాద్: భానుడు భగభగ మండిపోతున్నాడు. మాడ పగలగొట్టేస్తున్నాడు. ఎండ దెబ్బకు ఓ పక్క వడగాల్పులు..మరోపక్క తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇంట్లో ఫ్యాన్లు తిరుగుతున్నా కూలర్ల మోత మోగుతున్నా వేడిగాల్పే వస్తున్నది. ఎన్ని నీళ్లు తాగినా గొంతు తడారట్లేదు. గాలిలో తేమ శాతం వేగంగా పడిపోతుండటంతో డీహైడ్రేషన్‌కు గురై నీరసపడిపోతున్నారు. రాష్ట్రంలో బుధవారం గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరువయ్యాయి. నల్లగొండ జిల్లా నిడమనూరులో అత్యధికంగా 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఇదే అత్యధికం కావడం గమనార్హం. వచ్చే మూడు రోజులు
కూడా ఎండలు దంచికొట్టే అవకాశముంది. రాష్ట్రంలో ఇప్పుడు నమోదవుతున్న దానికంటే రెండు, మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరించింది. ఈ మేరకు అన్ని జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. వడగాల్పులు వీచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వడగాల్పులు వీచే జాబితాలో




కొమ్రంభీమ్ అసిఫాబాద్, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, నిర్మల్, కరీంనగర్ జిల్లాలున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండే అవకాశముంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 41 నుంచి 42 డిగ్రీలు నమోదయ్యే అవకాశముంది. అయితే, ఆయా జిల్లాల్లో ఒకటెండ్రు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. బుధవారం రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో 29 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. కొమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లా రెబ్బనలో అత్యధికంగా 4.03 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం లకుడారంలో 2.65 సెంటీమీటర్ల వర్షం పడింది.

# నటుడు రఘుబాబు కారు ఢీకొని బీఆర్ఎస్ నాయకుడు మృతి

హైదరాబాద్ : సినీనటుడు రఘుబాబు కారు ఢీకొని నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు మృతిచెందారు. టూటౌన్ ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి సందినేని జనార్దన్‌రావు(48) సమీపంలోని లెప్రసీకాలనీ ప్రాంతంలో ఉన్న తన వ్యవసాయ క్షేత్రం వద్దకు బుధవారం సాయంత్రం వాకింగ్ కోసం పానగల్ బైపాస్ మీదుగా ద్విచక్రవాహనంపై వెళు_న్నారు. వ్యవసాయ క్షేత్రం వద్ద యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో హైదరాబాద్ నుంచి గుంటూరుకు కారును స్వయంగా నడుపుతూ వెళ్తున్న రఘుబాబు.. వెనక నుంచి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టారు. దీంతో జనార్దన్‌రావు ఎగిరి డివైడర్ మీద పడ్డారు. తల, ఛాతి భాగంలో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. జనార్దన్‌రావు భార్య నాగమణి



ఫిర్యాదుతో రఘుబాబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసినట్లు సీఐ డానియేల్ తెలిపారు.

# మావోయిస్టులకు టెక్నాలజీ దెబ్బ

**- ఐదేండ్లలో అతి భారీ ఎన్‌కౌంటర్ ఇదే**
**- మృతి చెందిన 29 మంది మావోయిస్టుల్లో సగానికి పైగా మహిళలే..**
**- 27 లక్షల రివార్డు గల శంకర్రావు మృతి**
**- ముగ్గురు భద్రతా సిబ్బందికి తీవ్ర గాయాలు : బస్తర్ ఐజీ పి.సుందర్ రాజ్, కాంకేర్ ఎస్పీ కళ్యాణ్ ఐలెసెల్లి**

చర్ల: టెక్నాలజీ మావోయిస్టుల కొంప ముంచిందని పలువురు విశ్లేషిస్తున్నారు. టెక్నాలజీని ద్వారా మొబైల్ ఫోన్ ట్యాపింగ్, సిగల్ క్యాచింగ్‌తోపాటు కొరియర్ వ్యవస్థను పోలీసులు ఉపయోగించుకొని మావోయిస్టుల స్థావరాలను గుర్తించి మట్టుపెట్టారని అంటున్నారు. ఇదే విషయం మంగళవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌ను సూచిస్తుంది. కమాండర్ స్థాయి, ఏరియా కమిటీ కార్యదర్శి మావోయిస్టులకు నాలుగైదంచుల భద్రత ఉన్నప్పటికీ పోలీసులు చాకచక్యంగా మావోయిస్టుల స్థావరంపైకి వెళ్లి ఎన్‌కౌంటర్ చేశారు. దీంతో గడిచిన 15 ఏండ్లలో ఎన్నడూ ఇలాంటి నష్టం మావోయిస్టులకు కలగలేదని పలువురు చర్చించుకుంటున్నారు.
ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారిలో.. మావోయిస్టు అగ్రనేత, దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ ఆర్‌కేబీ డివిజన్ కమిటీ కార్యదర్శి, రూ.27 లక్షల రివార్డు కలిగిన ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఆత్మకూరు మండలం వద్ద రామాపురం గ్రామానికి చెందిన సుగులూరి చిన్నాన్న అలియాస్ శంకర్రావు ఉన్నట్టు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. అంతేకాకుండా దండకారణ్య స్పెషల్ జోన్ స్టేట్ మిలటరీ కమిషన్ ఇన్‌చార్జి రాందర్ అలియాస్ మజీదేవ్ కూడా మరణించినట్టు పోలీసు వర్గాలు తెలుపుతున్నాయి. మృతుల్లో మసీదేవ్ భార్య లలిత కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం పోలీసులకు, మావోయిస్టులకు మధ్య కాకులు దూరని కారడవిలో కాల్పులు మొదలై రాత్రి వరకు హోరాహోరీగా జరిగాయి. ఈ కాల్పుల్లో ఇప్పటికి 29 మంది మృతి చెందగా, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని, ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు జరుగుతున్నాయని బస్తర్ ఐజీ పి.సుందర్ రాజ్, కాంకేర్ ఎస్పీ కళ్యాణ్ ఐలెసెల్లి తెలిపారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలున్నట్టు తెలిసింది. పలువురు జవాన్లు కూడా గాయపడ్డారు. మావోయిస్టులు పక్కా స్థావరాలు ఏర్పాటు చేసుకొని ఛత్తీస్‌గఢ్‌లో ఈనెల 19 నుండి ప్రారంభమయ్యే పార్లమెంట్ ఎన్నికల్లో విధ్వంసం సృష్టించాలని ప్రణాళికలు వేస్తున్నారని తెలిసింది. వాటిని తిప్పికొట్టేందుకే పోలీసు బలగాలు పక్కా ప్రణాళికతో అడవులను జల్లెడ పడుతున్నాయి. ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సుమారు 70 మంది మావోయిస్టులు మృతిచెందారు. కాగా దండ కారణ్యంలో ప్రతి ఆదివాసీ గ్రామంలో భద్రతాబలగాలు పోలీస్ క్యాంపులు పెట్టాలనే యోచనలో ఉన్నాయని తెలుస్తోంది. ఏదేమైనప్పటికీ అడవుల్లో ఎర్రటి రక్తపు టేర్లు పారుతున్నాయని పలువురు వాపోతున్నారు.

# మావోయిస్టులారా వనం వీడి జనంలోకి రండి సీఐ శంకర్

గోవిందరావుపేట: మావోయిస్టులారా వనం వీడి జనంలోకి రావాలని పసర పోలీస్ స్టేషన్ సిఐ శంకర్ అన్నారు. బుధవారం మండలంలోని మొద్దులగూడెం గ్రామంలోమావోయిస్టు నాయకుడు కొయ్యడ సాంబయ్యఏ ఆజాద్ఏగోపన్న కుటుంబానికి పసర పోలీసుల చేయూత, నిత్యావసర సరుకులు అందజేసారు. ఈ సందర్భంగా సిఐ శంకర్ మాట్లాడుతూమావోయిస్టులారా వనం వీడి జనంలోకి రావాలని కన్నా తల్లిదండ్రులతో కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా జీవించాలని అన్నారు. ప్రభుత్వం తరఫున అనారోగ్యంగా ఉన్న వారికీ చికిత్స చేయిస్తామని, లొంగిపోయిన వారికి ఉపాధి కల్పిస్తామని అన్నారు. ఈరోజు ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిస్ ఆదేశాల మేరకు పసర పోలీస్ స్టేషన్ పరిధి లో మొద్దుల గూడెం లోని మావోయిస్టు రాష్ట్ర నాయకుడు కొయ్యడ సాంబయ్య ఏ ఆజాద్ఏ గోపన్న కుటుంబం ను పరామర్శించడం జరిగింది.ఈ సందర్భంగా సీఐ , ఎస్సై లు సాంబయ్య తండ్రి,, భార్య ల యొక్క బాగోగులు అడిగితెలుసుకున్నారు. తర్వాత ఎస్పి ఆదేశాల మేరకు సాంబయ్య కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు అందరూ జనజీవన స్రవంతిలో రావాలని పిలుపు నిచ్చారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం తరఫున సరైన ఉపాధి అందిస్తామని హామీ ఇచ్చారు. మావోయిస్టులు అవసరాన్ని బట్టి మాట్లాడితున్నారని హింస ధోరణి అవలంబించడం వల్ల ఎంతోమంది అడవుల్లో ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు . తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం సాధ్యమానే సిద్ధాంతాలను అవలంబిస్తూ ప్రజలను కిందిస్థాయి మావోయిస్టులను తప్పుదోవ పట్టిస్తూ ముఖ్య నేతల మరణాలకు అగ్రనాయకులు కారణమవుతున్నారని ఈసందర్భంగా అన్నారు. అలాగే కొయ్యడ సాంబయ్య ఎక్కడ ఉన్నా లొంగిపోయిటట్లు సహరించాలని కుటుంబ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. తర్వాత ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ తుపాకీ గొట్టం ద్వారా రాజాధికారం సాదించవచ్చు



అనే అపోహ వదిలి తెలంగాణ ప్రభుత్వం ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసి వృద్ధాప్యంలో ఉన్న తమ తల్లిదండ్రులకు మరియు కుటుంబ సభ్యుల యొక్క బాధ్యత నేరవేర్చే వ్యక్తిగా ఉండాలని కోరారు. ములుగు జిల్లా నుండి అజ్ఞాతంలో సిపిఐ మావోయిస్టు పార్టీలో పనిచేయుచున్న నాయకులు మరియు సభ్యులు ములుగు జిల్లా పోలీస్ ఎదుట లొంగిపోవాలి.
లొంగిపోయిన వారికి వారి పేరు మీద ఉన్న నగదు రివార్డును మరియు జీవనోపాధి కోసం వారికి పునరావాసం కల్పించడానికి ప్రభుత్వం ద్వారా కృషిచేస్తామని అన్నారు. నింగి పోవాలనుకుంటున్న మావోయిస్టులు వారి బంధువులు సంప్రదించవలసిన నెంబర్లు ఎస్ పి ములుగు 8712670100 ఓ ఎస్ డి ములుగు 8712670101 ఏ ఎస్ పి ఏటూరునాగారం 8712670104, డి ఎస్ పి ములుగు 8712670103, సీఐ పసర 8712670112,,ఎస్సై పసర8712670085 కార్యక్రమంలో పస్రా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# గుడుంబా స్థావరాలపై ఆకస్మిక దాడులు

**- నిర్వహించిన ఎస్సై లక్ష్మారెడ్డి**

శంకరపట్నం: గుడుంబా స్థావారాలపై ఆకస్మిక దాడులు నిర్వహించమని కేశవపట్నం ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శంకరపట్నం మండల పరిధిలోని కల్వల గ్రామ శివారులో గుడుంబా తయారు చేస్తున్నారన్న సమాచారంతో బుధవారం గుడుంబా స్థావరాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని, ఈ తనిఖీల్లో గుడుంబా తయారు చేస్తున్న అంగిడి సమ్మయ్య(60) ను గుర్తించి తయారు చేస్తున్న ప్రదేశంలో గుడుంబా కు సంబంధించిన వస్తు సామాగ్రిని ధ్వంసం చేసి అతని వద్ద నుంచి మెట్ పల్లి, కేశవపట్నం కు తరలిస్తున్న 40 గుడుంబా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు,ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ,



గుడుంబా తయారు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

# వచ్చేది మాన్సూన్ సీజన్

**- మొందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలి**
**- మొన్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్**

సిటీబ్యూరో: వచ్చేది మాన్సూన్ సీజన్ అని నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.
జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, వాటర్ వర్క్స్ ఎం.డీ సుదర్శన్ రెడ్డితో కలిసి జీహెచ్ఎంసీ పరిధిలో మాన్సూన్ ముందస్తు ఏర్పాట్లపై ఈ.ఎన్.సి, జోనల్ కమిషనర్‌లు, ఎస్ఈలతో సమీక్షించారు. ఈ సందర్భంగా దాన కిషోర్ మాట్లాడుతూ వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదలతో నగర వాసులకు ఎలాంటి ఇబ్బందులు, నష్టం వాటిల్లకుండా ముందస్తు ప్రణాళికతో పూర్తి పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డి.ఆర్.ఎఫ్) అన్నివేళలా అప్రమత్తమై సిద్ధంగా ఉండాలన్నారు. ఫైర్, వాటర్, జీహెచ్ఎంసీ, పోలీస్ తదితర శాఖలన్నీ కలిసి మే నెల చివరి వారంలోగాని, జూన్ మొదటి వారంలోగా మాక్ డ్రిల్ ఏర్పాటు చేయాలన్నారు. ఏదైనా ఆపద సంభవిస్తే ఆయా అధికారులు వచ్చి అండగా ఉంటారన్న నమ్మకం ప్రజలకు కల్పించాలన్నారు.
రెగ్యులర్ పూడిక తీత ( డిసిల్టింగ్) పనులు ప్రజలకు అవగాహన కోసం ఎగ్జిబిషన్ పెట్టాలని, వరద ముంపు కోసం చేపట్టిన అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో 125 వాటర్ లాగిన్ లొకేషన్స్ గుర్తించారని, 22 లొకేషన్స్‌లో సమస్యలను శాశ్వతంగా పరిష్కరించారని తెలిపారు.



40 లోకేషన్‌లలో పర్సనల్‌గా వెళ్లి పరిశీలించి శాశ్వతంగా పరిష్కరించాలన్నారు. మిగతా లొకేషన్లలో కూడా వాటర్ నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఈలకు సూచించారు. 1304 కి.మీ.పొడవు నాలాలు ఉన్నాయని, నాలాలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత చర్యలో భాగంగా నాలా ఆడిట్ చర్యలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రజలు నాలాలలో చెత్త వేస్తున్నారని, నాలాలలో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.
వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఈ.ఎన్.సీ జియా ఉద్దీన్, జోనల్ కమిషనర్లు రవి కిరణ్, హేమంత్ బోర్కడే, సహదేవ్ రావు, స్నేహ శబరీష్, అభిలాష అభినవ్, పంకజ వెంకన్న, సి.ఈలు దేవానంద్, కిషన్ లేక్స్ ఎస్.ఈ ఆనంద్, జోనల్ ఎస్.ఈ.లు అశోక్ రెడ్డి, చిన్న రెడ్డి, అనీల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పనులకు దివ్యాంగులు అనాసక్తి

**- సగంమంది కూడా పనులకు వేళ్ళని వైనం**
**- కఠిన నిబంధనలే కారణమా.?**
**- ప్రత్యేక భత్యం రద్దు**

మల్హర్ రావు: జాతీయ గ్రామీణ ఉపాదిహామీ పథకం పనులపై దివ్యాంగులు అంతగా ఆసక్తి చూపడం లేదు.ఇందుకు గతేడాది మండలంలో నమోదైన గుణనంకాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. దివ్యాంగులకిచ్చే ప్రత్యేక భత్యాన్ని రద్దు చేయడం, ఉపాధిహామీ పనుల నిబంధనలను కఠినతరం చేయడంతోపాటు వారికి చూపించే పనులు కూడా మార్చడంతో వచ్చేందుకు వారు వెనుకడుగు వేస్తున్నారు.దీంతో దివ్యాంగులకు వంద రోజుల ఉపాది కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం నిరుగారుతోంది.
నిబంధనలు కఠినతరం: ఉపాధిహామీ పథకంలో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని భావించిన కేంద్ర ప్రభుత్వం పనుల కల్పన,వేతనాల చెల్లింపునకు రాష్ట్ర స్థాయి నుంచి కేంద్రానికి పరిమితం చేసింది ఇందుకోసం గతేడాది పలు సంస్కరణలు చేపట్టింది. పనుల కల్పనకు సంబంధించిన వెబ్సైట్ మారడంతో దివ్యాంగులకు కల్పించే పనుల నిబంధనలను కఠినతరం చేసింది.గతంలో దివ్యాంగులు 70శాతం పని చేస్తే వారికి వందశాతం కూలి చెల్లించేవారు. సకలాంగులకు ఏడాదిలో వంద రోజుల పని కల్పిస్తే ,దివ్యాంగులకు 150 రోజులు పని కల్పించేవారు. పైగా వారికి 5 కిలో మీటర్ల లోపు మాత్రమే పనులను చూపేవారు.ఒకవేళ అంతకంటే ఎక్కువ దూరం పనికి వెళ్లాల్సి వస్తే 20 శాతం అలవెన్స్ లను అదనంగా చెల్లించేవారు.
పైగా వారికి నర్సరీలో మొక్కల పెంపకానికి సంబంధించిన బ్యాగులను నింపడం, ముళ్ల చెట్లను తొలగించడం, చెళ్ళలోని రాళ్లను తీసివేయడం వంటి సులభతరమైన పనులను చేయించేవారు. దివ్యాంగులకు సంబంధించి పనుల ప్రగతిపై ప్రత్యేక నివేదికలను కోరేవారు.కానీ ప్రస్తుతం పరిస్థితి మారింది.

# కబేళ కు తరలిస్తున్న గేదెలు స్వాధీనం

**- గోశాల కు తరలింపు..కేసు నమోదు**

అశ్వారావుపేట: అనుమతులు లేకుండా గేదెల ను అక్రమంగా రవాణా చేస్తున్న ఓ డీసీఎం వ్యాన్ తో డ్రైవర్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.స్థానిక ఎస్.హెచ్.ఒ,ఎస్ఐ శ్రీరాముల శ్రీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి అశ్వారావుపేట సమీపంలోని నందమూరి నగర్ సమీపంలోని అంతరాష్ట్ర చెక్ పోస్ట్ దగ్గర వాహనాలను తనిఖీ నిర్వహిస్తుండగా, ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం నుంచి హైదారాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ ను నిలిపి తనిఖీలు చేశారు.ఈ తనిఖీల్లో 32 గేదెలు ఉన్నట్లు గుర్తించి, దీనిపై విచారణ చేయగా ఈ గేదెలను రాజమండ్రి సమీపంలోని జగ్గంపేట సంతలో కొనుగోలు చేసి అనుమతి పత్రాలు లేకుండానే ఆచంట వెంకన్న బాబు అనే వ్యక్తి హైదరాబాద్ లోని ఓ కబేళ కు తరలిస్తున్నట్లు తేలింది. దాంతో డీసీఎం వ్యాన్ తో సహా డ్రైవర్ ను పోలీస్ స్టేషన్కు తరలించి సీజ్ చేశారు.

# వంశీతిలక్ ఎంట్రీతో మార్పు

హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలతోపాటు తెలంగాణలో కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరుగనుంది. 2023 ఎన్నికల్లో ఇక్కడి నుంచి దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందిత పోటీ చేసి విజయం సాధించింది. బీజేపీ అభ్యర్థి శ్రీగణేశ్ రెండో స్థానంలో నిలవగా, కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితమైంది. ఇక లాస్య నందిత రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. లోక్‌సభ ఎన్నికలతోపాటు ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఈసీ షెడ్యూల్ విడుదల చేసిందిఇక లాస్య నందిత మరణంతో ఖాళ అయిన కంటోన్మెంట్ స్థానాన్ని నిలుపుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. ఇందుకోసం లాస్య నందిత సోదరి నివేదితను అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించారు. ఇక అధికారం కాంగ్రెస్ ఈసారి కంటోన్మెంట్‌ను తన ఖాతాలో వేసుకోవాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన శ్రీగణేశ్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకుని అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో బీజేపీ కొత్త అభ్యర్థి వేటలో పడింది.ఇక భారతీయ జనతాపార్టీ కూడా తాజాగా కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థిని ప్రకటించింది. టీఎన్.వంశీతిలక్ పేరును ఖరారు చేసింది. ఈ మేరకు ఆయన పేరును అధికారికంగా మంగళవారం ప్రకటించింది. కంటోన్మెంట్ అభ్యర్థి కోసం మూడు పేర్లను బీజేపీ రాష్ట్ర నాయకత్వం పరిశీలించి జాతీయ నాయకత్వానికి పంపించింది. చివరకు వంశీ తిలక్‌కు టికెట్ ఖరారు చేసింది. వంశీ తిలక్ అందరికీ సుపరిచితుడు కావడంతో ఆయనను ఎంపిక చేస్తూ అధినాయకత్వం నిర్ణయం తీసుకుంది. తిలక్ మాజీ మంత్రి సదాలక్ష్మి, పద్మశ్రీ అవార్డు గ్రహీత టీవీ.నారాయణ దంపతుల కుమారుడు. వైద్య వృత్తిలో ఉన్నారు. సదాలక్ష్మి తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌తోపాటు బీజేపీ కూడా తమ అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో కంటోన్మెంట్‌లో ఈసారి ముక్కోణపు పోటీ ఖాయంగా కనిపిస్తోంది. మూడు పార్టీలు కంటోన్మెంట్‌ను తమ ఖతాలో వేసుకోవాలని చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో బలమైన అభ్యర్థులనే బరిలో దించాయి. ఉప ఎన్నికల మే 13న జరుగుతుంది.

# నివేదిత కు డబుల్ బెడ్ రూమ్ సెగ



హైదరాబాద్, : బీఆర్ఎస్ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఒకవైపు కాళేశ్వరం, విద్యుత్ ఒప్పందాల్లో అక్రమాలు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, లిక్కర్ స్కాంలో కవిత జైలుకు వెళ్లడం వంటివి ఆ పార్టీని ఇబ్బంది పెడుతున్నాయి. మరోవైపు గులాబీ పార్టీలో ఉండి పదేళ్లు వివిధ పదవులు అనుభవించిన వారు అధికార కాంగ్రెస్‌లో చేరుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కూడా పార్టీ మారుతున్నారు. ఈ క్రమంలో పార్టీ అధినేత కేసీఆర్‌కు, ఆ పార్టీ కంటోన్మెంట్ అభ్యర్థి నివేదితకు డబుల్ సెగ తగిలింది. నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల ఇవ్వడం లేదని మొన్న కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద ఇల్లు కేటాయించాలని ఆందోళన చేశారు. ఇక నిన్న నివేదిత ఇంటి వద్ద డబుల్ బెడ్‌రూం పేరుతో తమ నుంచి వసూరు చేసిన డబ్బులు ఇవ్వాలని బాధితులు ఆందోళనకు దిగారు. దీంతో నివేదిత నివాసం వద్ద ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్‌కు చెందిన నేతలు, సాయన్న అనుచరులుగా ముద్ర పడిన వారే డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ఆందోళన చేయడం సంచలనంగా మారింది. నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని పేరుత దివంగగత ఎమ్మెల్యేలు సాయన్న, ఆయన కుమార్తె లాస్య నందిత, ప్రస్తుత బీఆర్ఎస్ అభ్యర్థిథ నివేదిత నియోజకవర్గంలోని ప్రజల నుంచి రూ. 1.46 కోట్లు వసూలుచేసినట్లు బీఆర్ఎస్ లీడర్ సదానంద్‌గౌడ్ తెలిపారు. నియోజకవరలోని 30 మంది నుంచి రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు తీసుకున్నారని ఆరోపించారు. ఇండ్ల కోసం ఒత్తిడి చేయగా గతేడాది రూ. 12 లక్షలు తిరిగి ఇచ్చారని తెలిపారు. మిగతా రూ. 1.34 కోట్లు ఇవ్వాలని ఇంటి చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వసూలు చేసిన డబ్బులు ఇవ్వకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో భారీగా అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అర్హులైన ప్రతీ పేదవాడికి పైరవీలు లేకుండా డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పిన మాజీ సీఎం కేసీఆర్ మాటలకు.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఘటనలకు చాలా తేడా ఉంది. నాటి అధికార పార్టీ నేతలే ఇళ్ల పంపిణీ కోసం అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. ఈ క్రమంలో దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత వసూళ్ల దందాకు చెందిన ఆడియో గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు వైరల్‌గా మారింది.

ఆ ఆడియో.. దివంగత ఎమ్మెల్యే లాస్య నందితది అని తేలింది. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కోసం ఓ వ్యక్తి నుంచి రూ. 5 లక్షలు డబ్బులు తీసుకున్నట్టు ఈ ఆడియో ద్వారా తెలిసింది. ఇళ్లు ఇవ్వకపోగా.. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో ఈ వివాదం జరిగింది. ఇక వైరల్ అయిన వీడియోలో లాస్య నందిత తన తండ్రి సాయన్న పదవిని అడ్డు పెట్టుకుని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఉంది. లాస్య నందిత రూ. 5 లక్షలు తీసుకున్నట్లు వీడియోలో అంగీకరించింది. అయితే డబుల్ బెడ్ రూమ్ ఇంటిని ఇప్పించలేనందున వడ్డీ రూ. 3 లక్షలు కలిపి రూ. 8 లక్షలు ఇవ్వాలని బాధితుడు లాస్యనందితను డిమాండ్ చేయడం వీడియోలో ఉంది. వడ్డీ ఎలా ఇస్తానని లాస్య అతనితో వాదించింది. ఇదిలా ఉండగా తాజాగా సాయన్న రెండో కుమార్తె నివేదిత కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు పలువురు ఆరోపించడం సంచలనంగా మారింది.

# రైతుల చుట్టూ రాజకీయం

హైదరాబాద్: తెలంగాణలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల ఎజెండా విచిత్రంగా ఉంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పార్లమెంట్ ఎజెండా అంతా జాతీయ రాజకీయాలపైన నడుస్తోంది. మోదీ మరో మారు ప్రధాని అని బీజేపీ.. బీజేపీ వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారు లేదా మార్చేస్తారంటూ కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారం చేపడుతోంది. ఆయా రాష్ట్రాల్లో కూడా ఎన్డీయే, ఇండియా కూటమి పార్టీలు జాతీయ రాజకీయ అంశాలే ప్రాధాన్య అంశాలుగా ప్రచారం చేస్తున్నారు. జాతీయ పార్టీలను పక్కన పెడితే ప్రాంతీయ పార్టీలు ఉన్న రాష్ట్రాల్లో కూడా వారి ఎజెండా జాతీయ అంశాల చుట్టు పరిభ్రమిస్తుంటే... తెలంగాణలో మాత్రం స్థానిక అంశాలనే ఎన్నికల బరిలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ప్రధాన ఎజెండాగా ప్రచారం చేస్తున్నాయి. అందులోను రైతు సంబంధింత అంశాల చుట్టే అటు అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తిరగడం విశేషంగా చెప్పాలి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చేతిలో పరాభవం పొందిన బీఆర్ఎస్ తిరిగి తన బలం పెంచుకునే దిశగా మరో సారి అన్నదాతలనే నమ్ముకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ లోనే ఎక్కువ స్థానాలు గెల్చుకున్న గులాబీ పార్టీని రూరల్ తెలంగాణలోని ఫలితాలు పెద్ద దెబ్బతీసాయి. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ,వరంగల్, కరీంనగర్, మహబూబ్ నగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో పెద్దఎత్తున సీట్లు గెల్చుకుని మరో దఫా అధికారం చేపడతామని భావించిన బీఆర్ఎస్ కు ఆ జిల్లాల్లో ఘోర పరాభవం మిగిలింది. మెదక్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలే కారు పార్టీ పరువు కాపాడాయి. దీంతో రూరల్ తెలంగాణపై దృష్టి సారించిన గులాబీ దళపతి కేసీఆర్ రైతు ఎజెండాను మరో సారి పైకి తీసారు. ఈ క్రమంలోనే పార్టీ ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్ రావు రూరల్ తెలంగాణలో విస్తృతంగా ప్రర్యటించారు. రైతుల పొలం బాట పట్టి ఎండిన పంటలను పరిశీలించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సాగు నీరు ఇవ్వడం లేదని బీఆర్ఎస్ నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. మరో వైపు కేసీఆర్ సైతం నల్గొండ, వంరగల్ జిల్లాల్లో ప్రత్యేకంగా రైతుల కోసం పర్యటన చేపట్టారు. ఎండిపోయిన పంటలను పరిశీలించి ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు . 2 లక్షల రైతు రుణ మాఫీ పై రేవంత్ ప్రభుత్వాన్నినిలదీసారు. 200 మంది రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ జవాబుదారీ అంటూ నిప్పులు చెరిగారు. రైతు బంధు కింద 15 వేల రూపాయల ఆర్థిక సాయం , ఎండిన పంలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇలా రైతు సంబంధిత అంశాలను ఎప్పటికప్పుడు ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ , బీజేపీ ప్రభుత్వాలను టార్గెట్ చేస్తూ గులాబీ పార్టీ ఎన్నికల రాజకీయాల్లో సాగుతోంది.

వికసిత్ భారత్ కోసం మూడో సారి ప్రధానిగా మోదీని గెలిపించాలని దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రచారం చేస్తోంది. అయితే తెలంగాణలో మాత్రం బీజేపీ రైతు అంశాల పైనే ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ లను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తోంది. కరీంనగర్ లో ఎంపీ బండి సంజయ్ ఇటీవలే ఒక రోజు రైతు దీక్ష చేపట్టారు. హైదరాబాద్ లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి దీక్ష నిర్వహించారు. రైతులకు సాగు నీరు ఇవ్వడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఎకరాకు 25 వేల నష్ట పరిహారం చెల్లించాలని, అన్ని పంటలకు రూ. 500 బోనస్ ఇవ్వాలని ఈ దీక్ష ద్వారా బీజేపీ డిమాండ్ చేసింది. రైతు భరోసా కింద 15వేల ఆర్థిక సాయం చేయాలని, రైతు కూలీలకు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేస్తూ కమలం నేతలు దీక్షలు చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు కూడా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ను రైతు సమస్యలపై నిలదీయడం ద్వారా ఈ ఎన్నికల్లో లబ్ధి పొందే ప్లాన్ ను అమలు చేస్తున్నాయి. దేశ మంతటా ఎ.ఐ.ఆ.ఎ.ం కూటమని గెలిపించాలని, రాహుల్ ను ప్రధాని చేయాలని కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. బీజేపీకి ఓటు వేస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని ప్రచారం చేస్తోంది. అయితే తెలంగాణ కాంగ్రెస్ నేతలు మాత్రం బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు లేవనెత్తుతోన్న రైతు హామీలపైనే దృష్టి పెట్టి కౌంటర్ చర్యలు చేపట్టింది. రైతులకు నీరు ఇవ్వడం లేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ప్రతిపక్షాలు విమర్శిస్తుంటే, తాము అధికారంలోకి వచ్చి మూడు నెలలే అవుతుందని, బీఆర్ఎస్ పాలనలోనే ఈ పరిస్థితులు నెలకొన్నాయని కాంగ్రెస్ కౌంటర్ ప్రచారం మొదలు పెట్టింది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు కూడా 2 లక్షల రైతు రుణ మాఫీ హామీ పై కాంగ్రెస్ ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు.

నిన్న నారాయణ పేటలో జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు హామీల్లోని రెండు రైతు హామీలను అమలు తేదీని ప్రకటించారు. ఆగష్టు 15వ తేదీ లోపు రాష్ట్రంలోని అర్హులైన 69 లక్షల రైతులకు 2 లక్షల రుణ మాఫీ చేస్తామని ప్రకటించారు. వచ్చే సీజన్ నుండి ధాన్యానికి 500 రూపాయలు క్వింటాకు బోనస్ గా చెల్లించనున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్, బీజేపీలు రైతు రుణ మాఫీ విషయంలో కాంగ్రెస్ పై విమర్శలు ఎక్కుపెడుతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ గా ఆగష్టు 15 లోపు మాఫీ ఉంటుందని చెప్పి ప్రతిపక్షాల నోరు మూసే ప్రయత్నం చేశారు. అయితే రానున్న రోజుల్లో సాగు నీరు విషయంలోను ప్రతిపక్షాలు అధికార కాంగ్రెస్ ను ఇబ్బంది పెట్టే అవకాశాలున్నాయి. పంటలు ఎండిపోవడం కాంగ్రెస్ పార్టీకి కొంత ఇబ్బంది కలిగించే పరిణామం అనే చెప్పాలి. అయితే ఎన్నికలు దగ్గవుతున్న కొద్ది రైతుల అంశమే ప్రధాన ఎన్నికల ప్రచారంశం అవుతుందా.. లేక జాతీయ అంశాలు తెరపైకి వస్తాయా అన్నది మాత్రం వేచిచూడాలి. అంతే కాకుండా ఈ మూడు పార్టీల్లో రైతు ఓటు బ్యాంకు కొల్లగొట్టే పార్టీ ఏదా అన్నది కూడా వేచి చూడాల్సిన విషయమే.

# 'పెద్ద 'పల్లి 'బాద్షా 'ఎవరు అయ్యేనో..?

**- జోరందుకున్న ఎన్నికల ప్రచారం.**

**- ముక్కోణనపు పోటీలో గెలుపు ఎవరిదో.**

**- పెద్దపల్లి సభ తో జోరు పెంచి జోష్ లో 'కాంగ్రెస్'**



పెద్దపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం లో మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ టిఆర్ఎస్ బిజెపి పార్టీల నడుమ హోరా హోరికొనసాగుతోంది. పెద్దపల్లి పట్టణంలోని బంధం పల్లె వద్దగల స్వరూప గార్డెన్లో పెద్దపల్లి పార్లమెంట్ స్థాయి సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేయగా కాంగ్రెస్ పార్టీలోకి మంథని పెద్దపల్లి రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల్లోని జెడ్పిటిసిలు నాయకులు మాజీ సర్పంచులు ఎంపీటీసీలు విజయ రమణారావు శ్రీధర్ బాబుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ దినదినం బలోపేతం కోసం శతవిధాల ప్రయత్నం చేస్తోంది. పెద్దపల్లిలో ఎలాగైనా భారీ మెజార్టీతో గెలిచి తీరాలనే దృక్పథంతో గడ్డం వివేక్ వెంకటస్వామి తన కుమారుడైన వంశీ కృష్ణ గెలుపు కొరకు ప్రతి అసెంబ్లీ స్థానంలో పెద్ద ఎత్తున కార్యకర్తలను పోవు చేసి భారీ ఎత్తున సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో దూకుడు పెంచి ముందు వరుసలోకి వచ్చింది. అలాగే ఆరుసార్లు ఎమ్మెల్యేగా రాష్ట్ర ప్రభుత్వ విప్ గా రాష్ట్ర మంత్రిగా పనిచేసిన టిఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కోల్ బెల్ట్ ప్రాంతంలో తిరుగుతూ ముమ్మర ప్రచారం చేస్తున్నారు. బిజెపి అభ్యర్థి గోమాత శ్రీనివాస్ సైతం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రచారంలోకి దూసుకెళు తున్నారు.

ప్రచారంలో మూడు పార్టీలు ఎత్తులు పైఎత్తులు వేస్తున్నారు . నాయకులు గెలుపుపై ధీమా ఎవరి ధీమా వారే వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంటు ఎన్నికలపై ప్రధాన పార్టీలన్నీ ఫోకస్ పెట్టా యి.. పెద్దపల్లి పార్లమెంట్ స్థానంలో త్రిముఖ పోరు నెలకొంది. మూడు ప్రధాన పార్టీలు ప్రచార స్పీడ్ను పెంచాయి. మూడు పార్టీల అభ్యర్థు లు ఖరారు అయిన నేపథ్యంలో ప్రచారంలో ఎత్తులు పైఎత్తులు వేస్తు న్నాయి. ప్రతి ఒక్కరిని కలిసి ఓటును అభ్యర్థిస్తున్నాయి. ఈ మూడు పార్టీల నాయకులు గెలుపుపై ధీమాని వ్యక్తం చేస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో మూడు పార్టీల అభ్యర్థులు గత పదిహేను రోజుల నుండి ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. కాంగ్రెస్ నుంచి గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ నుంచి కొప్పుల ఈశ్వర్, బీజేపీ నుంచి గోమాస శ్రీనివాస్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ ఇక్కడ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలని కైవసం చేసుకుంది. ప్రతిపక్ష పార్టీలు గత అసెంబ్లీ ఎన్నికలలో గట్టి పోటి ఇవ్వలేక పోయాయి. కాంగ్రెస్ టికెట్ విషయంలో మొదట విభేదాలు ఉన్నప్పటికీ తరువాత సద్దుమణిగాయి. ఇప్పుడు లోక్సభ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేస్తున్నారు. ఇక్కడ అత్యధికంగా సింగరేణి కార్మికులు ఉన్న కారణంగా వారి ఓట్లని రాబట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి అన్ని పార్టీలు. వంశీకృష్ణ నాన్న, పెద్ద నాన్న ఈ లోక్సభ నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. దాదాపుగా అసెంబ్లీ కేంద్రాలతో పాటు, మండల కేంద్రాలు మేజర్ గ్రామ పంచాయతీలలో సమావేశం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా బీఅర్ఎస్, బీజేపీ పైనా విమర్శలు చేస్తూ ప్రజల్లోకి వెళు తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ సింగరేణి ప్రైవేటీకరణ చేసేందుకు ప్లాన్ చేశాయని కాంగ్రెస్ నేతలు బలంగా జనంలోకి తీసుకువెళ్తున్నారు. కార్మికుల ఓట్లకు గాలం వేసి ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పిస్తున్నారు. అటు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రచారాన్ని ముమ్మరం

చేశారు. ఈయన గతంలో సింగరేణి కార్మికుడు కావడంతో సింగరేణి కార్మికుల ఓట్లు తమకే వస్తాయని ధీమాగా ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే కొత్త ఉద్యోగాల కల్పన, కార్మికుల సమస్యలను పరిష్కరించమని ప్రస్తావిస్తున్నారు. తమ ఉద్యమం కారణంగానే సింగరేణి ప్రైవేటీకరణ కాలేదని సమావేశాలలో గుర్తు చేస్తున్నారు. ఆరు గ్యారంటీలు అటకెక్కాయని, బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. రైతులకు ఇబ్బందులు వచ్చినా అటువైపు చూడని కాంగ్రెస్ కి గుణపాఠం తప్పదని కొప్పుల విపర్శిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ పూర్తిగా మోదీ హావానే నమ్ముకున్నారు. అయన సామజిక వర్గం ఓట్లు ఎక్కువగా ఉండడంతో గెలుపులో కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. కుటుంబ పార్టీ అయిన కాంగ్రెస్, బీఆర్ఎస్లకు గుణపాఠం తప్పదని అంటున్నారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఅర్ఎస్కు ఓటు వేసిన వృధా అని విమర్శలు చేస్తున్నారు. ఈ మూడు పార్టీల అభ్యర్థులు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటూ ప్రచారాన్ని వేడెక్కిస్తున్నారు. కాగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఏడు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా ఉండడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ రాష్ట్రప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలు అమలుతో ముందుకెళ్తూ ఎలాగైనా గెలిచి తీరుతామని ధీమాతో ఉన్నారు. అలాగే బిజెపి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని గోమాస శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. తనకు పాత పరిచయాలే ఈ పార్లమెంట్లో ఎలాగైనా గెలిపిస్తాయని మాజీ మంత్రి టిఆర్ఎస్ అభ్యర్థి కోపుల ఈశ్వర్ నమ్మకంతో ఉన్నారు. ఏది ఏమైనా పెద్ద పల్లి ప్రజలు ఎవరిని బాధాషా చేస్తారో వేసి చూడాల్సిందే.

# భారతదేశ జనాభా 144కోట్లు..!

**- జనాభాలో 24 శాతం మంది 0-14 సంవత్సరాల మధ్య వయస్కులు**

**- 17శాతం మంది 10-19 సంవత్సరాల మధ్య వయస్కులున్నారు**


**- జనాభాలో 68 శాతం మంది 10-24 ఏళ్ల మధ్య వయస్కులు**

**- 7 శాతం మంది 65 ఏళ్లు పైబడిన వారు**

**- పురుషుల ఆయురార్ధం 71 సంవత్సరాలు**

**- మహిళల ఆయుర్ధాయం 74 సంవత్సరాలు**

**యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ నివేదిక..!**



న్యూ డిల్లీ : భారత దేశ జనాభా 144 కోట్లకు చేరిందని అంచనా. ఇందులో 24శాతం మంది 0-14 సంవత్సరాల వయసున్న ఉన్నారు. ఈ విషయాన్ని యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ (జఔఈఖం) నివేదిక పేర్కొంది. అయితే, 2011లో నిర్వహించిన జనాభా లెక్కల ప్రకారం భారతదేశ జనాభా 121 కోట్లు. అయితే, ప్రసవ సమయంలో శిశు మరణాలు తగ్గుముఖం పట్టాయని నివేదిక వెల్లడించింది. భారతదేశ జనాభాలో 24 శాతం మంది 0-14 సంవత్సరాల మధ్య వయస్కులు కాగా.. 17శాతం మంది 10-19 సంవత్సరాల మధ్య వయస్కులున్నారు. జనాభాలో 68 శాతం మంది 10-24 ఏళ్ల మధ్య వయస్కులు కాగా, 7 శాతం మంది 65 ఏళ్లు పైబడిన వారు ఉన్నారు. పురుషుల ఆయురార్ధం 71 సంవత్సరాలు కాగా.. మహిళల ఆయుర్ధాయం 74 సంవత్సరాలు. 2006 నుంచి 2023 మధ్య భారత్‌లో బాల్య వివాహాల శాతం 23శాతంగా ఉందని పేర్కొంది. ఇక దేశంలో డెలివరీ సమయంలో మరణాలు తగ్గుముఖం పట్టాయి. పీఎల్ఓఎస్ గ్లోబల్ పబ్లిక్ హెల్త్ నివేదికను ఉదహరిస్తూ.. 640 జిల్లాల్లో ప్రసవానంతర మరణాల నిష్పత్తి లక్ష జననాల్లో 70 కంటే తక్కువగా ఉంది. 114 జిల్లాల్లో ఈ నిష్పత్తి 210 కంటే ఎక్కువగా ఉంది. వికలాంగులు, శరణార్థులు, జాతి మైనారిటీలు, క్వీర్ కమ్యూనిటీలు, హెచ్ఐవీతో బాధితులతో పాటు అట్టడుగు వర్గాలకు చెందిన మహిళలు, బాలికలు అత్యధిక లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్య ప్రమాదాలను ఎదుర్కొంటున్నారని వేదిక పేర్కొంది. చదువుకునే, పని ప్రదేశాల్లో కుల వివక్షను ఎదుర్కొంటున్న మహిళలకు చట్టపరమైన రక్షణ కల్పించాలని భారతదేశంలోని దళిత ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నట్లుగా నివేదిక పేర్కొంది. కొన్ని కుటుంబాలు పూర్తిగా నిరుపేదలుగా మిగిలిపోతాయని.. తమ కుటుంబాలను పోషించలేరని.. వారి పిల్లలను పేదరికం నుంచి బయటకు తీసుకురాలేరు. ఇది పేలవమైన లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యాన్ని ప్రోత్సహించే చక్రానికి దోహదం చేస్తుంది. దాదాపు సగం మంది దళిత మహిళలకు ప్రసవానంతర సంరక్షణ అందడం లేదు. ప్రతిరోజూ 800 మందికిపైగా మహిళలు ప్రసవ సమయంలో మరణిస్తున్నారని నివేదిక తెలిపింది. నాలుగో వంతు మంది మహిళలు తమ భాగస్వామితో శృంగారాన్ని నిరాకరించలేకపోతున్నారు. ప్రతి పది మంది మహిళల్లో ఒకరు సొంత నిర్ణయాలు తీసుకోలేకపోతున్నట్లుగా నివేదిక పేర్కొంది.

# సివిల్స్ లో ఐఐటీయన్ల హవా...

న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ ? 2023 తుది ఫలితాలల్లో ఐఐటియన్లు సత్తా చాటారు. ఈసారి సివిల్స్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఆదిత్య శ్రీనివాస్తవ మెయిన్స్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌ను తన ఆప్షన్‌గా ఎంచుకున్నారు. ఐఐటీ కాన్పూర్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ (బీటెక్) పూర్తిచేశారు. రెండో ర్యాంక్ సాధించిన అనిమేశ్ ప్రధాన్ ఐఐటీ రూర్కెలాలో కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ అభ్యసించారు. సివిల్స్ మెయిన్స్‌లో ఆప్షనల్‌గా సోషియాలజీని ఎంచుకున్నారు. సివిల్స్ మూడో ర్యాంకర్ తెలంగాణకు చెందిన దోనూరు అనన్యరెడ్డి ఢిల్లీ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్(ఆనర్స్) జాగ్రఫీ చదివారు. సివిల్స్ మెయిన్స్‌లో ఆంథ్రోపాలజీని ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకున్నారు. అత్యంత కష్టసాధ్యమైన పరీక్షల్లో యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ సర్వీసెస్ ఒకటి. ఎంతో నిబద్ధతతో ప్రిపేరయ్యేవారు మాత్రమే ఇందులో మెరుస్తారు.. ఈ ఫలితాల్లో అఖిల భారత స్థాయిలో ఆదిత్య శ్రీవాస్తవ ఫస్ట్ ర్యాంక్, అనిమేశ్ ప్రధాన్ రెండో ర్యాంక్ సొంతం చేసుకోగా.. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన దోనూరు అనన్యరెడ్డి ఆలిండియా మూడో ర్యాంకు కైవసం చేసుకుంది. పి.కె.సిద్ధార్థ్ రామ్‌కుమార్‌కు నాలుగో ర్యాంకు, రుహానీకు ఐదో ర్యాంకు లభించింది. సృష్టి దబాస్ ఆరో ర్యాంకు, అన్మోల్ రాథోడ్ 7వ ర్యాంకు, ఆశిష్ కుమార్కు 8వ ర్యాంకు, నౌషీన్‌కు 9వ ర్యాంకు, ఐశ్వర్యం ప్రజాపతికు 10వ ర్యాంకు.. తొలి పది ర్యాంకు వీరు సొంతం చేసుకున్నారు. 2023వ సంవత్సారానికి గానూ అఖిల భారత సర్వీసులకు మొత్తం 1,016 మంది ఎంపికైనట్ల యూపీఎస్సీ ప్రకటించింది.

వీరిలో 664 మంది పరుషులు, 352 మంది మహిళలు ఉన్నారు. టాప్ 5 ర్యాంకర్లలో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉండగా.. టాప్ 25 ర్యాంకర్లలో 15 మంది పురుషులు, 10 మంది మహిళలు ఉన్నారు. ఎంపికైన అభ్యర్థుల్లో దివ్యాంగులు 30 మంది ఉన్నట్లు యూపీఎస్సీ వెల్లడించింది. కాగా యూపీఎస్సీ సివిల్స్ సర్వీసెస్ 2023కు దేశ వ్యాప్తంగా 10.16 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 5.92 లక్షల మంది పరీక్షకు హాజరైతే 14,624 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఇక వీరిలో 2,855 మంది ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. మూడు దశల్ల ఫిల్టర్ చేసి చివరకు 1,016 మందిని కేంద్ర సర్వీసులకు యూపీఎస్సీ ఎంపిక చేసింది. ఎంపికైన మొత్తం అభ్యర్థుల్లో జనరల్ కేటగిరీలో 347 మంది, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 115 మంది, ఓబీసీలో 303 మంది, ఎస్సీలో 165 మంది, ఎస్టీలో 86 మంది ఉన్నారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలో కేంద్ర సర్వీసులకు ఎంపికైన విజేతలకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టు షేర్ చేశారు.

# మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశం 200 ఏళ్లు వెనక్కి వెళుతుంది

**తమిళనాడు ముఖ్యమంత్రి డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్**

చెన్నయ్ ; ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై తమిళనాడు ముఖ్యమంత్రి డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేంద్రంలో ప్రధాని మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశం 200 ఏళు వెనక్కి వెళుతుందని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా డీఎంకే అభ్యర్థి టీఆర్ బాలుకు మద్దతుగా శ్రీపెరంబుదూర్‌లో జరిగిన ర్యాలీలో సీఎం పాల్గొని ప్రసంగించారు. 'కేంద్రంలో ప్రధాని మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశం 200 ఏళ్లు వెనక్కి వెళ్లిపోతుంది. చరిత్ర తిరగరాస్తుంది. అదే విధంగా సైన్స్ కూడా వెనక్కి వెళుతుంది. అప్పుడు మూఢనమ్మకాలతో కూడిన కథలకు ప్రాధాన్యత ఏర్పడుతుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ఆర్ఎస్ఎస్ నియమాలతో నిండిపోతుంది. అలా జరగకూడదంటే.. దీనికి వ్యతిరేకంగా ఓటు వేయడం ఒక్కటే ఆయుధం' అని వ్యాఖ్యానిం చారు. బీజేపీకి ఓటేస్తే తమిళనాడు శత్రువుకు వేసినట్లే అని స్టాలిన్ దుయ్యబట్టారు. 'బీజేపీకి ఓటేస్తే తమిళనాడు శత్రువులకు వేసినట్లే. అన్నాడీఎంకేకు వేసిన ఓటు రాష్ట్ర ద్రోహులకు వేసినట్లే' అని వ్యాఖ్యానిం చారు. ఏఐఏడీఎంకే, బీజేపీ పార్టీలు సహజ మిత్రపక్షాలు అని పిలిచేవారు, కానీ ఇప్పుడు అవి విడిపోయినట్లుగా వ్యవహరిస్తున్నా యని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో మెజారిటీ అవసరమైతే బీజేపీకి మద్దతు ఇస్తారా అని మీడియా ఏఐఏడీఎంకేను ప్రశ్నించినప్పుడు.. ఎడప్పాడి కె. పళనిస్వామి అన్నాడీఎంకే మద్దతు ఇవ్వదని చెప్పలేదని, 'వెయిట్ అండ్ సీ' అని సమాధానం చెప్పినట్లు స్టాలిన్ గుర్తు చేశారు. ఏఐఏడీఎంకే పార్టీ బీజేపీకి ఎప్పటికీ వ్యతిరేకం కాదని.. ఆ పార్టీకి ఓటేస్తే కమలం పార్టీకి వేసినట్లే అని ముఖ్యమంత్రి స్టాలిన్ దుయ్య బట్టారు.

# 22న ఇంటర్, చివరి వారంలో టెన్త్ రిజల్ట్స్

హైదరాబాద్, : తెలంగాణ ఇంటర్, పదో తరగతి ఫలితాల కోసం లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల ఫలితాలు ఏప్రిల్ 25 నాటికి విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే ఇందుకు సంబంధించి ఇంటర్ బోర్డు నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఏప్రిల్ 10 నాటికి స్పాట్ వాల్యూయేషన్ పూర్తి అయిన సంగతి తెలిసిందే. దీంతో ఒకేసారి ఇంటర్ ఫస్టియర్, సెకండ్ ఇయర్‌కు కలిపి ఒకేసారి ఫలితాలు విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం 4 విడతల్లో జరిగిన ఇంటర్ స్పాట్ వాల్యూయేషన్ పూర్తికావడంతో మార్కుల నమోదుతో పాటు ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ మొత్తం ఏప్రిల్ 21వ తేదీ నాటికి పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు మార్కుల వెల్లడికి ఈసీ అనుమతి కోరుతూ ఇంటర్ బోర్డు లేఖను రాసింది. ఈసీ నుంచి అనుమతి లభిస్తే ఏప్రిల్ 22 నుంచి 25 మధ్య ఇంటర్ ఫలితాలు విడుదల అయ్యే అవకాశం ఉంది.కాగా ఈ ఏడాది మొత్తం 9 లక్షల మందిపైగా విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరయ్యారు. వీరంతా ఎప్పుడెప్పుడా అని ఫలితాల కోసం వెయిట్ చేస్తున్నారు. గతేడాది నాటి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మే 9వ తేదీని ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ ఫలితాలను విడుదల చేశారు. గతేడాది సుమారు 9 లక్షల మంది ఈ పరీక్షలకు హాజరయ్యారు. 2023 ఇంటర్ ఫలితాల్లో ఫస్ట్ ఇయర్‌లో 61.68 శాతం, సెకండ్ ఇయర్‌లో 63.49 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అయితే గత ఏడాది మాదిరిగా కాకుండా ఈసారి తొందరగానే తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈసీ అనుమతి రాగానే ఫలితాల ప్రకటన తేదీపై విద్యాశాఖ అధికారులు స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. ఫలితాల ప్రకటన అనంతరం బిబఎతివ.ఇఱఱ.ఱనీల.తిని, తీవబబీశ్రీబిబ.ఇఱఱ.ఱనీల.తిని అధికారిక వెబ్‌సైట్‌లలో రిజల్ట్స్ చెక్ చేసుకోవచ్చు.మరోవైపు తెలంగాణలో పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం దాదాపుగా చివరికి వచ్చింది. ఏప్రిల్ 3న ప్రారంభమైన స్పాట్ వాల్యూయేషన్ 13వ తేదీ వరకు కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 19 కేంద్రాలలో స్పాట్ వాల్యూయేషన్ చేపట్టారు. మార్కులు కంప్యూటరీకరణ, పునఃపరిశీలన ప్రక్రియ పూర్తి చేసి, ఏప్రిల్ చివరి వారంలో లేదంటే మే మొదటి వారంలో ఫలితాలు విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే.

# ఆకట్టుకోలేకపోతున్న కేసీఆర్ ప్రసంగాలు

### ఫోన్ ట్యాపింగ్, కవిత అరెస్ట్, కాళేశ్వరంపై మౌనమేనా



హైదరాబాద్: రత రాష్ట్ర సమితి అధినతే కేసీఆర్ రెండు మూడు రోజులలో టీవీలలో కూర్చుని మొత్తం చెబుతానని కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ అంశాలపై మీడియాతో చెప్పారు. కానీ ప్రకటనలు చేసి..రోజులుగా గడిచిపోతున్నాయి. టీవీలు రెడీ అయ్యాయి కానీ ఆయన నుంచి మాత్రం ఎలాంటి స్పందన రావడం లేదు. చివరికి కుమార్తె అరెస్టు గరించి కూడా ఒక్క మాట మాట్లాడటం లేదు. కవితను ఈడీ జైలుకు పంపి నెల రోజుల అయింది. ఈ లోపు సీబీఐ కూడా అరెస్టు చూపించింది. అయినా ఎన్నికల బహిరంగసభల్లో కేసీఆర్ రేవంత్ రెడ్డిని వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకుంటున్నారు. రాజకీయ వ్యాఖ్యలే చేస్తున్న ఆయన బీజేపీలో చేరబోతున్నారని జోస్యం చెబుతున్నారు. కానీ కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, కవిత అ?రెస్టుపై మాత్రం మాట్లాడటం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీవీలలో కూర్చుని తానే అసలు విషయాలు చెబుతానని కేసీఆర్ నల్లగొండలో ప్రకటించారు. ఇది ప్రకటించి దాదాపుగా నెల కావొస్తుంది. కానీ మర్చిపోయారు. ఫోన్ ట్యాపింగ్ గురించి కూడా తాను రెండు రోజుల్లో చెబుతానన్నారు. కానీ మర్చిపోయారు. అటు కాళేశ్వరం గురించి కానీ.. ఇటు ఫోన్ ట్యాపింగ్ గురించి కానీ ఆయన మాట్లాడతారా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. కేసీఆర్ మాట్లాడితే మొదటి అక్షరం నుంచి చివరి అక్షరం వరకూ చూపించడానికి టీవీలు రెడీ అయిపోయాయి. వీటిపైనే కాదు.. కేసీఆర్ ఇంకా అనేక కీలక విషయాలపై స్పందించడం లేదు. కూతురు కవిత అరెస్టుపై ఇంతవరకు స్పందించలేదు. కవిత అరెస్టయి సోమవారానికి నెలరోజులైంది. అరెస్టయిన దగ్గర నుండి కవిత ఢిల్లీలోని తీహార్ జైలులోనే ఉన్నారు. తన కూతురు అరెస్టు అక్రమమని కాని సక్రమమని కాని కేసీయార్ ఇంతవరకు మాట్లాడకపోవటమే చాలా మందిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఒకపుడు కేంద్రప్రభుత్వానికి లేదా బీజేపీకి వ్యతిరేకంగా ఏ చిన్న అవకాశం దొరికినా ఆకాశమే హద్దుగా కేసీయార్ రెచ్చిపోయిన విషయం అందరికీ తెలిసిందే. అలాంటిది అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కూతురును ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ఈడీ, సీబీఐలు అరెస్టులు చేసినా సైలెంట్ గా ఉన్నారు. తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న టెలిఫోన్ ట్యాపింగ్. ట్యాపింగ్ అంశంపై విచారిస్తున్న స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఇప్పటికే సుమారు పదిమంది పోలీసు అధికారులను అరెస్టుచేశారు. వీరంతా బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నపుడు ప్రత్యర్థుల ఫోన్లను తాము టార్గెట్ చేసి వారి ఫోన్లను ఎలా ట్యాపింగ్ చేసింది పూసగుచ్చినట్లు చెప్పినట్లు మీడియాలో ప్రచారం జరుగుతోంది. లీకులద్వారా అందుతున్న అరెస్టయిన పోలీసు అధికారులు చెప్పిన సమాచారం ప్రకారం ప్రభుత్వంలోని పెద్దతలకాయ ఆదేశాల ప్రకారమే ట్యాపింగ్ జరిగిందని వాంగ్మూలాలు ఇచ్చారని అంటున్నారు. ఇదే విషయమై మంత్రులు, అధికార కాంగ్రెస్ నేతలు, కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి తదితరులంతా ట్యాపింగ్ కు బాధ్యులుగా కేసీయార్, కేటీయార్, హరీష్ రావులపైనే ఆరోపణలు చేస్తున్నారు. వ్యతిరేకులంతా ట్యాపింగ్ అంశంలో కేసీయార్ పై చర్యలు తీసుకోవాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. కరీంనగర్ పర్యటనలో కేసీయార్ ట్యాపింగ్ విషయమై అన్నీ వివరాలు చెబుతానన్నారు. ట్యాపింగ్ జరిగిందా లేదా ? ట్యాపింగ్ లో ఎవరిని అరెస్టుచేయాలనే విషయాన్ని కూడా మూడు నాలుగు రోజుల్లో చెబుతానని చెప్పారు. ఈ మాటచెప్పి పదిరోజులు అవుతున్నా ఇంతవరు నోరిప్పలేదు. ట్యాపింగ్ అంశమైనా, కవిత అరెస్టుపైనా కేసీయార్ ఎందుకని నోరిప్పటంలేదు ? కూతురిని చూడటానికి కేసీయార్ ఢిల్లీకి కూడా వెళ్ళలేదు.

తన హయాంలో జరిగిన టెలిఫోన్ ట్యాపింగ్ కు బాధ్యత వహించాల్సింది కేసీయారే అని అందరికీ తెలుసు. పైగా తమ హయాంలో ట్యాపింగ్ జరిగిందని స్వయంగా కేటీయారే అంగీకరించారు. కొడుకు ట్యాపింగ్ జరిగిందని అంగీకరించిన తర్వాత ట్యాపింగ్ జరగలేదని కేసీయార్ అనేందుకు లేదు. ట్యాపింగ్ తో తనకు సంబంధంలేదని తప్పించుకునేందుకూ లేదు. ఏ రకంగా చూసినా తేనెతుట్టెను కదలించినట్లే అవుతుందని కేసీయార్ భావించినట్లున్నారని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. మేడిగడ్డ కుంగిపోవడం, ఫోన్ ట్యాపింగ్ చేయడం, కవిత అరెస్టుపై తాను స్పందిస్తే ఇంకా ఎక్కువ చర్చ జరుగుతుందని అందుకే వీలైనంత కామ్ గా ఉండటం మంచిదన్న భావనకు వచ్చారన్న అభిప్రాయం వినిపిస్తోంది. గతంలో ఈటల రాజేందర్ బీజేపీలో చేరి హుజూరాబాద్ లో పోటీ చేసినప్పుడు వచ్చే ఎన్నికల నాటికి ఆయన కాంగ్రెస్ లో చేరిపోతారని కేటీఆర్ ప్రతీ ఇంటర్వ్యూలో చెప్పేవారు. కేసీఆర్ అసలు ఈటల గురించి స్పందించేవారు కాదు.

ఇప్పుడు కేటీఆర్ తో పాటు కేసీఆర్ కూడా.. రేవంత్ రెడ్డి బీజేపీలోకి వెళ్తారని అంటున్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల రేవంత్ రెడ్డి మీద కాంగ్రెస్ హైకమాండ్ లో అనుమానం కల్పించాలన్న వ్యూహం కావొచ్చు. నిజానికి రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ కాకుండా ఉండేందుకే ఆయనను పలుమార్లు అరెస్టు చేయించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అప్పుడు నమ్మని కాంగ్రెస్ హైకమాండ్ ఇప్పుడు ఎలా నమ్ముంతుందన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. కీలక అంశాలపై స్పందించకుండా రేవంత్ రెడ్డి బీజేపీలోకి వెళ్తారంటే.. బీఆర్‌ఎస్‌కు ప్రజలు ఓట్లు వేస్తారా అన్న ప్రశ్న కూడా సహజంగానే వస్తుంది. కానీ కేసీఆర్ స్ట్రాటజీ అంతే కనిపిస్తోంది. ఫలితాలు ఎలా ఉంటాయన్నది జూన్‌లో తేలే అవకాశం ఉంది.

# ముగ్గురు అభ్యర్థులు గులాబీ పార్టీతో లింక్

వరంగల్, : రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకున్న హస్తం పార్టీ హవా వరంగల్ లో కొనసాగుతుందా? లేదా ఉద్యమాల గడ్డ వరంగల్లో బ్రేకులు పడ్డ కారు కదులుతుందా? కమలం వికసిస్తుందా..? అనే సందేహాలు ఎన్నో. సామాజిక, రాజకీయ, విప్లవోద్యమాలకు కేంద్ర బిందువు వరంగల్. ప్రజా ఉద్యమాలతో పాటు రాజకీయాల్లో రాష్ట్ర, దేశ స్థాయిలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మారుతున్న రాజకీయ పరిణామాలతో తెలంగాణలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంపై ప్రధాన పార్టీలు గురిపెట్టాయి.వరంగల్ పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేస్తున్న బీఅర్‌ఎస్ లో పాటు బీజేపీ, కాంగ్రెస్ ముగ్గురు అభ్యర్థులు గులాబీ పార్టీ వెళ్లిన వలస నేతలే. బిజేపి నుంచి పోటీ చేస్తున్న ఆరూరి రమేష్ 2010 నుండి బీఅర్‌ఎస్ లో కొనసాగుతూ రెండు సార్లు ఎమ్మెల్యేగా చేశారు. బీఅర్‌ఎస్ అధికారాన్ని కోల్పోవడంతో బీజేపీలో చేరి బీజేపీ అభ్యర్థిగా పార్లమెంట్ బరి లో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య కూడా బీఅర్‌ఎస్ గూటి పక్ష తండ్రి 2012 నుండి బీఅర్‌ఎస్ లో కొనసాగి ఉప ముఖ్యమంత్రిగా పని చేసి మొన్నటి ఎన్నికల్లో బీఅర్‌ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూ కూతురుతో కలిసి కాంగ్రెస్ లో చేరారు. ఇక బీ అర్ ఎస్ అభ్యర్థి హనుమకొండ జడ్పీ చైర్ మెన్ గా కొనసాగుతూ సుధీర్ కుమార్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో దిగారు.ఈ ఎన్నికల్లో త్రిముఖ పోటీ తప్పేలా లేదు. రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్ గెలుపు ధీమాతో ఉండగా. బీఆర్ ఎస్ అసెంబ్లీ ఎన్నికల ఓటమితో దిద్దుబాటు చర్యలతో సత్తా చాటడం కోసం ప్రయత్నాలు చేస్తుంది. కాషాయదళం ఈసారి వరంగల్ పార్లమెంట్ లో పాగా వేసి 40సంవత్సరాల చరిత్రను తిరగారాయాలని చూస్తుంది. బిజేపి, కాంగ్రెస్ పార్టీలు మండలాల వారిగా కార్యకర్తల సమావేశం నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నారు. బీ అర్ ఎస్ అభ్యర్థిని రెండు రోజుల క్రితమే ప్రకటించడంతో బీ అర్ ఎస్ నేతలు రంగంలోకి దిగుతున్నారు. ఏదేమైనా ఈసారి మూడు పార్టీలు పదునైన విమర్శలతో ఢీ అంటే ఢీ అంటున్నాయి.టీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీకి అండగా ఉంది వరంగల్. 2009 నియోజక వర్గ పునర్వ్యవస్థీకరణకు ముందు, తరువాత వరంగల్ పార్లమెంట్ లో బీఅర్‌ఎస్ పాగా వేసింది. 2009లో ఎస్సీ రిజర్వుడు అయిన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి 3 సార్లు ఎన్నికలు జరిగాయి. 2009 కాంగ్రెస్, 2014, 2019లో టీఆర్‌ఎస్ భారీ మెజారిటీ తో విజయం సాధించాయి.వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోకి ఏడు అసెంబ్లీ నియోజకవర్గం వస్తాయి. భూపాలపల్లి, పరకాల, పాలకుర్తి, స్టేషన్ ఘన్పూర్, వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాలు. ఇందులో గత అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్ పూర్ మినహా ఆరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే లు విజయం సాధించారు. స్టేషన్ ఘనపూర్ లో గెలిచిన బీ అర్ ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయినా కాంగ్రెస్ పార్టీ గెలుపు అంతా సులువుగా లేదు.వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రెండవ రాజధానిగా చెప్పుకొనే వరంగల్ నగరంతోపాటు వ్యవసాయంపై ఆధారపడే ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. హైదరాబాదు తరువాత రెండవ రాజధానిగా చెప్పుకోవడమే తప్ప అభివృద్ధి జరగలేదు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కాజీపేట లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం ఎడ్ల తరబడి నగరవాసుల కలగానేమిగిలింది. నగరంలో జాతీయ స్థాయి విద్యాసంస్థలు ఉన్న ఐటీ కంపెనీలు రావడంలేదు. నగర అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే. అనేక కేంద్ర ప్రభుత్వ పథకాలు ఉన్న నగరం అభివృద్ధికి నీచుకోవడంలేదు. ఇక రూరల్ ప్రాంతంతో వ్యవసాయ ఆధారిత ప్రాజెక్టులు లేకపోవడంతో ఉపాధి అవకాశాలు తగ్గాయి. రాకరాక టెక్స్టైల్ పార్క్ వచ్చిన ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఎన్నికల ముందు హామీ లు ఇవ్వడమే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు. ఈ సారి ప్రజలు ఎవరిని నమ్ముతారు. జాతీయ వాదమా.. ప్రాంతీయ వాదమా... అభివృద్ధి వాదమా ఎవరికి పట్టం కడతారో చూడాలి.

# 20 వేల కోట్ల ఆదాయం...

హైదరాబాద్, : దక్షిణ మధ్య రైల్వే 2023-24 ఆర్థిక సంవత్సరంలో స్థూల మూలాధార ఆదాయంలో రూ. 20,339.36 కోట్ల ఆదాయాన్ని నమోదుచేసింది. ఇది జోన్ ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకు ఇదే తొలిసారిగా చెబుతున్నారు రైల్వే అధికారులు. 2022-23లో సాధించిన రూ. 18,976 కోట్ల కంటే 7 శాతం అధికంగా లెక్కలు చెబుతున్నాయి.ఈ ఆదాయం పెరుగుదలకు ముఖ్యమైన అంశాలను పరిశీ లిస్తే.. ప్రయాణీకుల అవసరాలను తీర్చడానికి చేపట్టిన ముఖ్యమైన చర్యలు కీలకంగా ఉన్నాయి. అందులో సరి కొత్త రైళ్లను ప్రవేశపెట్టడం, ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తేవడం, డిమాండ్ ఉన్న రైళ్లలో అదనపు కోచ్‌ల జోడించడం, రద్దీ ఉన్న ప్రాంతాలకు రైళ్లను పెంచడం వంటి చర్యలను తీసుకుంది రైల్వే శాఖ.2023-24 ఆర్థిక సంవత్సరంలో అధిక ప్రయాణీకుల అవసరాలను తీర్చడానికి 117 రైళ్లలో తాత్కాలిక ప్రాతిపదికన 6,921 అదనపు కోచ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ చర్యల ద్వారా ప్రయాణీకుల రవాణా ద్వారా రూ. 5,731.8 కోట్ల అత్యుత్తమ ఆదాయాన్ని సాధించడంలో దోహద పడినట్లు తెలిపారు.అదే సమయంలో, ప్రయాణీకుల రవాణ విషయానికొస్తే, 2022-23సంవత్సరంలోని 255.59 మిలియన్లతో పోలిస్తే 2023-24 సంవత్సరంలో 262.62 మిలియన్ల మంది ప్రయాణీ కులు దక్షిణ మధ్య రైల్వే ద్వారా ప్రయాణించినట్లు తెలుస్తోంది.2023-24 ఆర్థిక సంవత్సరంలో, దక్షిణ మధ్య రైల్వే మునుపెన్నడూ లేనివిధముగా రూ.13,620 కోట్లు సాధించింది. ఇది మునుపటి సంవత్సరంతో పోలిస్తే 4.4% పెరుగుదలను నమోదుచేసింది. సరుకు రవాణా సేవల మెరుగుదలను పెంపొందించడం కోసం 6 కొత్త గతిశక్తి కార్గో టెర్మినల్స్ ఏర్పాటు చేశారు. సరుకు రవాణా వినియోగదారుల కోసం లోడింగ్, అన్‌లోడ్ ప్రక్రియ కోసం అనేక ముఖ్యమైన వస్తువులను భద్రపరచడానికి షెడ్‌లను గణనీయంగా పెంచారు. అందులో మౌళిక సదుపాయాలు, అవసరమైన మెరుగులు దిద్దడం వల్ల రైల్వేల ద్వారా రవాణా చేసేందుకు వినియోగదార్లు మొగ్గు చూపారు. దక్షిణ మధ్య రైల్వేకు మునుపెన్నడూలేని విధంగా 141.12 మిలియన్ టన్నులు అత్యుత్తమ సరుకు రవాణా లోడింగ్ చేయడా నికి దారితీసింది. చెకింగ్ వలన వచ్చిన రాబడి కూడా కీలకమైంది. జోన్ 2023-24 సంవత్సరంలో రూ. 512 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. ఇది 2022-23 సంవత్సరంలో నమోదైన రూ. 414.87 కోట్ల ఆదాయం కంటే ఎక్కువ.దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఈ అద్భుతమైన మైలు రాయిని సాధించడంలో కృషిచేసిన అధికారులు, సిబ్బందిని ప్రశంసించారు.

# 40 డిగ్రీలు దాటిన టెంపరేచర్

హైదరాబాద్, : తెలంగాణ రాష్ట్రంలో కింది స్థాయి గాలులు దక్షిణ, ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ రోజు, రేపు, ఎల్లుండి రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ఈరోజు నుండి 2 రోజులు తెలంగాణ రాష్టంలో కొన్ని జిల్లాలలో అక్కడ అక్కడ గరిష్ట ఉష్ణోగ్రత్తలు క్రమేణా 2 నుంచి 3 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. రేపు, ఎల్లుండి తెలంగాణ రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో అక్కడక్కడ వడగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేశారు.తెలంగాణలోని కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ వేడిగాలులు వీచే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేశారు.హైదరాబాద్ లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 40 డిగ్రీలు, 27 డిగ్రీలుగా ఉండే అవకాశం ఉంది. ఉపరితల గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా ఉండే అవకాశం ఉంది.

నిన్న గరిష్ఠ ఉష్ణోగ్రత 39.1 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 27.1 డిగ్రీలుగా నమోదైంది. 39 శాతంగా గాలిలో తేమ శాతం నమోదైంది. రాయలసీమ మీద ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో ఉంది. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణలో దక్షిణ దిశగా గాలులు వీస్తున్నాయి. ఈ వాతావరణ ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర, యానం ప్రాంతాల్లో వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణం ఒకటి లేదా రెండు చోట్ల ఏర్పడవచ్చు.దక్షిణ కోస్తాంధ్రలో వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణం ఒకటి లేదా రెండు చోట్ల ఏర్పడే అవకాశం ఉంది. రాయలసీమలోనూ వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణం ఒకటి లేదా రెండు చోట్ల ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. వడగాలులు రాయలసీమలో ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

# భవిష్యత్తు అంతా ఈ వీలదే


### -ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్: భవిష్యత్తు అంతా ఎలక్ట్రికల్ వాహనాలదేనని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఇవి వాహనాల క్రయ విక్రయాల కోసం రూపొందించిన జూయ్ యాప్ ను మదన్మోహన్, యాప్ కో ఫౌండర్లు ప్రణయ్ మహంత్ మల్లికార్జున లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పకృతికి ఎలాంటి హాని చేయాలి విద్యుత్ తో నడిచే వాహనాలు ఎంతో మేలని అన్నారు. ప్రముఖ వ్యాపారవేత్తలు ఎలెన్ మాస్క్ ప్రపంచంలో మొట్టమొదటిసారిగా విద్యుత్తు నడిచే వాహనాల రూపొందించడం యావత్ మానవులకి గొప్ప ఆవిష్కరణ అయిందని అన్నారు. ఈ నేపథ్యంలోనే ఐలాండ్ మాస్క్ సంస్థను హైదరాబాద్ నగరంలో నెలకొల్పాలని ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. పూర్తి మానవ వనరులు అందుబాటులో ఉన్న మహానగరంలో ఈ పరిశ్రమ ఏర్పాటు చేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సైతం భవిష్యత్తులో పెను మార్పులు సృష్టించనుందని అన్నారు . దీనిని గుర్తించిన తమ ప్రభుత్వం రాష్ట్ర రాజధానిలో 500 ఎకరాలలో ఏఐసిటీని నెలకొల్పేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం జూలై మాసంలో గ్లోబల్ ఏఐ సమ్మిట్ ను నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు.

# బాయిల్డ్ రైస్ కు కేంద్రం ఓకే

హైదరాబాద్: తెలంగాణ నుంచి పారాబాయిల్డ్ బియ్యం సేకరణకు కేంద్రం ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు విడుదల చేయడంతో కేంద్ర వినియోగ దారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి పీయుష్ గోయల్‌కు కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. 2023-24 ఖరీఫ్ తో పాటు రబీ సీజన్ లకు సంబంధించి తెలంగాణ నుంచి 30లక్షల మెట్రిక్ టన్నుల పారాబాయిల్డ్ రైస్ సేకరించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. రాష్ట్రం నుంచి అంత మొత్తంలో బియ్యం సేకరణ కు ఆమోదం తెలిపిన కేంద్రానికి కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపా రు.పారాబాయిల్డ్ బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా తెలంగాణ రైతులకు ఎంతో మేలు కలుగుతుం దని కిషన్ రెడ్డి అన్నారు. కనుక రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతుల నుంచి వరిధాన్యాన్ని వెంటనే సేకరించాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం హామీగా ఇచ్చిన హామీ మేరకు కనీస మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ను చెల్లించి రైతుల నుంచి బియ్యం సేకరించాలని సూచించారు. రైతులకు లబ్ధి చేకూరేందుకు వీలున్న అన్ని మార్గాల్లో కేంద్ర ప్రభుత్వం తనవంతు కృషిచేస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు.పెరుగుతున్న ఎరువుల ఖర్చుల భారం రైతులపై పడకుండా కేంద్రమే భరిస్తుందన్నారు. ఈ ఏడాదికి ఎరువుల రాయితీ 500 శాతం పెరిగింది. యూరియా బస్తాపై కేంద్రం రూ. 1470 సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. అంతర్జాతీయంగా ఎరువుల రెట్లు పెరిగిన మోదీ ప్రభుత్వం మాత్రం ఎరువుల రెట్లు పెంచకుండా సబ్సిడీలో తక్కువ ధరకే రైతులకు ఎరువులను అందిస్తుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను గాలికొదిలేసి కొత్త హామీలతో వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఓటు అడిగేందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకు లను ప్రశ్నించాలని నేటి దీక్షలో కిషన్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్ పార్టీ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల సమస్యలు తెలుసుకునేందుకు బీజేపీ రాష్ట్ర కార్యాల యంలో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేశారు. తెలంగాణ రైతుల కష్టాలు, సమస్యలు, ఫిర్యాదులు తెలుసుకునేందుకు రాష్ట్ర పార్టీ కార్యాల యంలో మిస్డ్ కాల్ నెం: 9904 119 119 ను ఏర్పాటు చేసింది. రైతులకు నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతులకు అన్ని రకాలుగా అండగా ఉంటుందని, రైతులెవ్వరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని కోరారును. రైతులకు ఏ కష్టమొచ్చినా, సమస్యలు వచ్చినా బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి తెలపాలని రైతులకు విజప్తి చేశారు. ఇచ్చిన హామీలు ఏమాయ్యాయని రైతులు నిలదీయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న రూ.500 బోనస్, కౌలు ఆర్థిక సాయం, రైతు కూలీలకు రూ .12వేల సాయం ఎప్పుడిస్తారో చెప్పాలని అడగమన్నారు.

# అల్లు అర్జున్ సినిమాల్లో సీన్లు రీక్రియేట్ చేస్తూ 'మారుతి నగర్ సుబ్రమణ్యం'లో రొమాంటిక్ సాంగ్... 'మేడమ్ సార్ మేడమ్ అంతే'





రావు రమేష్ హీరోగా నటించిన సినిమా 'మారుతీ నగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. రావు రమేష్ సరసన ఇంద్రజ నటించారు. అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి మరో జంటగా, హర్షవర్ధన్ కీలక పాత్రలో నటించారు. పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలపై సినిమా రూపొందుతోంది. బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మాతలు. సినిమాలో రెండో పాట 'మేడమ్ సార్ మేడమ్ అంతే'ను ఇవాళ విడుదల చేశారు.

'మారుతి నగర్ సుబ్రమణ్యం' సినిమాలో రావు రమేష్ కుమారుడిగా అంకిత్ కొయ్య నటించారు. ఆయన ప్రేమించే అమ్మాయిగా రమ్య పసుపులేటి కనిపించనున్నారు. వాళ్లిద్దరి మీద 'మేడమ్ సార్ మేడమ్ అంతే' పాటను తెరకెక్కించారు. ఈ సినిమాలో అల్లు అర్జున్ అభిమానిగా అంకిత్ కొయ్య కనిపించనున్నారు. అందుకని, ఆయన అల్లు అర్జున్ సినిమాల్లో హీరోయిన్ ఇంట్రడక్షన్ సన్నివేశాలను ఊహించుకుంటూ తన ప్రేమ పాటను పాడుకున్నారు.

'తొలి తొలి సారి తొలిసారి
గుండె గంతులేస్తున్నదే!
ఏంటీ అల్లరి అంటే వినకుందే!
ఎందుకనో నువ్వు నచ్చేసి
వెంట వెంట పడుతున్నదే!
కన్ను తోడు రమ్మని పిలిచిందే!
నిన్ను చూడగానే ఒంటిలోన ఉక్కపోత
నువ్వు నవ్వగానే సంబరాలు ఎందుచేత
ఒక్క మాట చెప్పు ఇంటి ముందు వాలిపోతా
ఏదో మాయ చేశావటే
నిన్ను ఇడిసిపెట్టి నేను యాడికెళ్ళిపోతా
నక్సలైటు లాగ నేను నీకు లొంగిపోతా
ఇలాగ ఇలాగ ఇలాగ ఇలాగ ఎప్పుడు లేదే
తనందం ఎంతటి గొప్పది అంటే
తలెత్తి చూడక తప్పదు అంతే
తలొంచి మొక్కిన తప్పేం కాదే
మేడమ్ సారు మేడమ్ అంతే' అంటూ సాగిందీ పాట.

'మేడమ్ సార్ మేడమ్ సార్'ను ప్రముఖ గాయకుడు సిద్ శ్రీరామ్ పాడారు. ఇప్పటి వరకు ఆయన ఇంత హుషారైన పాటను పాడలేదని చెప్పాలి. కళ్యాణ్ నాయక్ అందించిన అద్భుతమైన బాణీని తన గాత్రంతో మరో స్థాయికి తీసుకు వెళ్లారు. భాస్కరభట్ల పాటను రాశారు.

'మారుతీ నగర్ సుబ్రమణ్యం' దర్శక నిర్మాతలు మాట్లాడుతూ... "టైటిల్ పాత్రలో రావు రమేష్ గారి లుక్, ఆల్రెడీ విడుదల చేసిన టైటిల్ సాంగ్ 'నేనే సుబ్రమణ్యం... మై నేమ్ ఈజ్ సుబ్రమణ్యం'కు సూపర్బ్ రెస్పాన్స్ లభించింది. భాస్కరభట్ల గారు తొలి పాటతో పాటు ఈ పాటకూ అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. ఈ రోజు సన్నాఫ్ సుబ్రమణ్యంగా నటించిన అంకిత్ కొయ్య సాంగ్ విడుదల చేశాం. అతను పోషించిన పాత్రకు, అల్లు అర్జున్ గారికి సినిమాలో చిన్న కనెక్షన్ ఉంటుంది. అది ఏమిటనేది ప్రస్తుతానికి సస్పెన్స్. 'జోహార్', 'తిమ్మరుసు', 'మజిలీ', 'శ్యామ్ సింగ రాయ్'తో పాటు మరికొన్ని సినిమాల్లో నటించిన అంకిత్ కొయ్య మంచి నటన కనబరిచారు. రమ్య పసుపులేటి ఈ జనరేషన్ ఇన్నోసెంట్ అమ్మాయి రోల్ చేశారు. వీళ్లిద్దరి మధ్య సన్నివేశాలు ప్రేక్షకుల్ని నవ్విస్తాయి, కవ్విస్తాయి. లిధా మ్యూజిక్ యూట్యూబ్ ఛానల్ ద్వారా మా సినిమాలో పాటల్ని విడుదల చేస్తున్నాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలో సినిమా విడుదల తేదీ వెల్లడిస్తాం" అని చెప్పారు.

# కలర్స్ స్వాతి ప్రధాన పాత్రలో రూపొందుతోన్న హిలేరియస్ ఎంటర్‌టైనర్ 'టీచర్'



90స్ టీమ్ నుంచి వస్తోన్న మరో నవ్వుల జల్లు

ఆద్యంతం కడుపుబ్బ నవ్వించే నవ్వుల జల్లుతో తెరకెక్కుతోంది టీచర్. తెలంగాణలోని అంకాపూర్ అనే గ్రామంలో ఉన్న ముగ్గురు డల్ స్టూడెంట్స్ కి సంబంధించిన కథతో తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో టీచర్‌గా కలర్స్ స్వాతి నటిస్తున్నారు. అడ్డూఅదుపూ లేకుండా అల్లరి చేసే ముగ్గురు విద్యార్థులు టీచర్‌ని కలిసిన తర్వాత ఏం జరిగింది? వాళ్ల జీవితాలు ఎలా మారాయి? అనేది హృద్యంగా ఉంటుంది. సరదా సన్నివేశాలు, సంభాషణలు, అందమైన, అమాయకమైన ప్రేమ, భావోద్వేగాలతో కూడిన ప్రయాణం... ప్రేక్షకుల మనసులను టచ్ చేస్తుందనడంలో అసలు సందేహం లేదు.

ఇటీవల 90స్– ఎ మిడిల్ క్లాస్ బయోపిక్ తో బ్లాక్ బస్టర్ అందుకున్న టీమ్ నుంచి వస్తోంది టీచర్. ఆదిత్య హాసన్ ఈ సినిమాను డైరక్ట్ చేశారు. నవీన్ మేడారం నిర్మించారు. ఎంఎన్ఓపీ (మేడారం నవీన్ అఫిషియల్ ప్రొడక్షన్స్) సంస్థ నిర్మిస్తోన్న రెండో సినిమా ఇది.

నటీనటులు

స్వాతి రెడ్డి (కలర్స్ స్వాతి), నిఖిల్ దేవాదుల (బాహుబలి ఫేమ్), నిత్యశ్రీ (కేరాఫ్ కంచరపాళెం ఫేమ్), రాజేంద్ర గౌడ్, సిద్ధార్థ్ (90స్ ఫేమ్), హర్ష, పవన్ రమేష్, నరేందర్ నాగులూరి, సురేష్ తదితరులు

# ఈ సినిమా మనం చూస్తూ ఉండే కథ. సినిమా చూసిన ప్రతి ఒక్కరు అలాగే అంటారు - సత్యం రాజేష్



'పొలిమేర–2'తో ఊహించని సక్సెస్ అందుకున్న సత్యం రాజేష్ హీరోగా నటించిన చిత్రం 'టెనెంట్'. వై.యుగంధర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో మేఘా చౌదరి, చందన పయ్యావుల, ఎస్తర్ నోరోన్హా, భరత్ కాంత్ కీలక పాత్రలు పోషించారు. మహాతేజ క్రియేషన్స్ బ్యానర్‌పై మోగుళ్ల చంద్రశేఖర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకొస్తోంది. రీసెంట్‌గా ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన ట్రైలర్‌కి మంచి రెస్పాన్స్ వస్తోంది. కొత్తగా పెళ్లైన జంట .. వేరు కాపురం .. అందమైన జీవితం. ఎన్నో ఆశలతో ఆ జంట కొత్తకాపురాన్ని మొదలుపెడుతుంది. ఆనందంగా .. అన్యోన్యంగా సాగిపోతున్న వారి జీవితంలోకి అతని వైపు నుంచి మరదలు .. ఆమె వైపు నుంచి ఒక ఫ్రెండ్ ఎంటరవుతారు. ఆ ఇద్దరితో పాటే ఈ దంపతుల మధ్య అపోహలు .. అపార్థాలు మొదలవుతాయి. అప్పుడు వాళ్లు ఏం చేస్తారు? వాళ్ల జీవితం ఎలాంటి మలుపు తీసుకుంటుంది? అనేది కథ. ఒక వైపున క్రైమ్ .. మరోవైపున సస్పెన్స్ .. ఇంకోవైపున రొమాన్స్‌తో కూడిన ఈ సినిమాపై బజ్ పెరుగుతూ వచ్చింది. ఈ చిత్రానికి సాహిత్య సాగర్ అందించిన సంగీతం మరో ప్లస్ అయింది. సినిమా విడుదల దగ్గర పడడంతో జోరుగా ప్రమోషన్స్ చేస్తోంది చిత్రయూనిట్. అందులో భాగంగా హీరో సత్యం రాజేష్ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఆ విశేషాలు... టెనెంట్ ఎవరు? ఎవరు ఎవరింటికి వస్తున్నారు? ఏంటి ఈ సినిమా కథ? ఇది ఎదురింట్లో లేదా పక్కింట్లో జరిగే కథ. భార్యభార్తల మధ్య వచ్చే ప్రాబ్లమ్స్ గురించి చూపించే కథ. ఒక అపార్ట్‌మెంట్‌లో జరిగే స్టోరీ. అన్నీ రియల్ లైఫ్ ఇన్సిడెంట్స్‌లాగే ఉంటాయి. డైరెక్టర్ ఏం చెప్పారో అది పర్‌ఫెక్ట్‌గా తీశారు. ప్రతి సీన్ చాలా బాగుంటుంది. సినిమా థియేటర్‌లో చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని చెప్పేలా ఉంటుంది. ఆడియన్స్‌కు ఈ సినిమా బ్యూటిఫుల్ ఫీల్ ఇస్తుంది.

టెనెంట్‌కు 'ఎ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారు?

సినిమా ట్రైలర్‌లో మేడమీద నుంచి పడి చనిపోయే సీన్ ఉంది కదా.. అది సినిమాటిక్‌గా చూపిస్తే క్లీన్ సర్టిఫికెట్ వస్తుంది. కానీ రియాలిటీకి దగ్గరగా చూపిస్తేనే ఆడియన్స్‌కు ఒరిజినల్ ఫీల్ కలుగుతుంది. ఈ సీన్‌ను రియాలిటీకి దగ్గరగా చూపించడం వల్లే 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ సినిమాలో చాలా లేయర్స్ ఉంటాయి.

మీరు ఇలాంటి సినిమాలనే ఎందుకు సెలెక్ట్ చేసుకుంటున్నారు?

నేను మంచి కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమాలనే సెలెక్ట్ చేసుకుంటున్నా. నాకు యాక్షన్, డ్యాన్సలు, రొమాంటిక్, మాస్ ఎలిమెంట్స్, భారీ బడ్జెట్ లాంటి సినిమాలను ఎంచుకోను. నేను ఆర్టిస్ట్‌గా చేస్తూనే.. మంచి పాయింట్ ఉన్న సినిమాలు చేయాలనేది నా కోరిక. ఇప్పుడు ఎవరితోనే పోటీ పడాలనే కోరిక నాకు లేదు.

ట్రైలర్‌లో ఎడిటింగ్ కట్స్ చాలా బాగున్నాయి. సినిమాలో షార్ట్స్ వాడారా? ట్రైలర్ కోసం సెపరేట్‌గా కట్ చేయించారా?

ఒక్క షాట్ కూడా ట్రైలర్ కోసం అని చేయలేదు. అన్నీ సినిమాలో షార్ట్స్ వాడాము. డైరెక్టర్ యుగంధర్ గారు కథ చెప్పినప్పుడే నేను హ్యాపీ అయ్యాను. అప్పటి నుంచి ఇప్పటి వరకూ నేను కథ వింటూనే ఉన్నా. ఇది భలే ఉందే అని ఫీలయిన కథ ఇది.

ఇది ఓటీటీ కోసం తీసిన కథ అని చెప్పారు. కానీ థియేటర్‌లో రిలీజ్ చేస్తున్నారు. 'పొలిమేర–2'తో సక్సెస్ రావడం వల్ల థియేటర్‌లో రిలీజ్ చేస్తున్నారా? కథ చాలా బాగుందని చిన్న సినిమాగా స్టార్ చేశాం. ఓటీటీ కోసమే అనుకుని చేస్తున్న క్రమంలో సినిమా అవుట్‌పుట్ చూసుకుంటే అనుకున్న దానికంటే చాలా బాగా వచ్చింది. అప్పుడు థియేటర్‌లో రిలీజ్ చేయాలని అనుకున్నాం. అందుకోసం ఇంకా ఇంప్రూవ్ చేశాం. ఇలాంటి ఆఫ్ బీట్ సినిమాలకు రైటింగ్ చాలా ముఖ్యం.. ఈ సినిమా రైటింగ్‌లో ఉన్న మ్యాజిక్ ఏంటి?

ఈ సినిమా కథను వర్మ శ్రీనివాస్ గారు రాశారు. ఆయన రైటింగ్ చాలా నేచురల్‌గా ఉంది. ఇందులో ఓవర్ డైలాగ్స్ ఉండవు. సినిమాలో నేను మాట్లాడేదే చాలా తక్కువ ఉంటుంది. సినిమా మొత్తం ఎక్కడా బోర్ కొట్టకుండా ఉంటుంది. మీరు అన్నీ కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమాలే చేస్తున్నారు కదా.. మీరు పర్టికులర్‌గా ఇలాంటివే సెలెక్ట్ చేసుకుంటున్నారా? లేక ఇలాంటి కథలే మీ దగ్గరికి వస్తున్నాయా?

నా దగ్గరకు వచ్చిన వాటిలో నేనే సెలెక్ట్ చేసుకుంటున్నా. ఎలాంటి ఎక్స్‌పెక్టేషన్స్ లేని సినిమాలు చేయడం వల్ల ఇండస్ట్రీలో పది కాలాలపాటు చల్లగా ఉంటాం. పోటీలో దిగి ఫైట్ చేసి ఓడిపోతే ఇంటికి వెళ్లిపోవాలి. మనం కుమ్మేస్తా.. కొట్టేస్తాం అని చెప్పే అలవాటు నాకు లేదు. నా జీవితం ఏంటో అందరూ చూసేశారు కదా. నాకు నచ్చే సినిమాలనే నేను చేస్తా. థ్రిల్లర్ సినిమాలకు మ్యూజిక్ అనేది చాలా ఇంపార్టెంట్.. పొలిమేర–2లో కూడా మ్యూజిక్ బాగా హైలైట్ అయింది. ఈ సినిమాలో మ్యూజిక్ ఎలా ఉంటుంది? ఈ సినిమాకు సాహిత్య సాగర్ సంగీతం అందించారు. ఈ సినిమాకు మ్యూజిక్కే ప్రాణం. క్లైమాక్స్‌లో డబ్బింగ్ చెప్తున్నప్పుడు నేనే అలా అలా పాజ్ అయ్యా. ఒక ఆడియన్‌లాగా నాకే కన్నీళ్లు వచ్చాయి. సినిమాలో మ్యూజిక్ ఫీల్ అంతగా ఉంటుంది. సాహిత్య సాగర్‌కు నిజంగా హ్యాట్సాఫ్ చెప్పాలి. ఇకపై హీరోగానే చేస్తారా? ఆర్టిస్ట్‌గా కూడా కొనసాగుతారా? నేను ఆర్టిస్టుగా చేస్తా.. ఆల్రెడీ కొన్ని సినిమాల్లో చేస్తున్నా. మంచి కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమాలు వస్తే.. నాకు సూట్ అవుతాయనుకుంటేనే హీరోగా చేస్తా. హీరో అంటే చాలామంది ఎలివేషన్స్ కోరుకుంటారు.. మీ సినిమాల్లో అలాంటివి లేవు. భవిష్యత్తులో ఏమైనా ఉంటాయా?

నాకు అలాంటి ఎలివేషన్స్ నచ్చవు. నేను మెయిన్ క్యారెక్టర్‌లో స్ట్రీట్ ఫైట్ అనే ఒక కామెడీ సినిమా చేస్తున్నా. అందులో ఎలివేషన్స్ ఉండవు కానీ.. కమర్షియల్ సినిమాలా ఉంటుంది. మీ కెరీర్‌లో 'క్షణం' చెప్పుకోదగ్గ సినిమా కదా.. అలాంటి క్యారెక్టర్స్ మీ దగ్గరకు రాలేదా? వచ్చినా మీరు చేయలేదా? క్షణం తర్వాత దగ్గర దగ్గర 50 సినిమాల్లో పోలీస్ రోల్స్ వచ్చాయి. కానీ మళ్లీ అలాంటి పాత్రలే చేస్తే బాగోదని చేయలేదు. కొన్ని పోలీస్ పాత్రలు కామెడీ చేసేలా ఉంటాయి. అలాంటివి చేయను. కొంచెం పవర్‌ఫుల్‌గా ఉంటే చేయొచ్చు. ప్రకాష్ రాజ్, రఘువరన్ లాంటి వాళ్లలాగా డిఫరెంట్ క్యారెక్టర్స్ చేయాలనేది నా కోరిక. టెనెంట్‌లో ట్విస్ట్‌లు, సస్పెన్స్ ఎంతవరకూ ఉంటాయి?

ఈ సినిమాలో ట్విస్ట్‌లు ఉండవు కానీ.. సస్పెన్స్ ఉంటుంది. మర్డర్ మిస్టరీ కాబట్టి చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. నా క్యారెక్టర్ చూసి ఆడియన్స్ సింపతీతో బయటకు వస్తారు.

నెక్స్ట్ ప్రాజెక్ట్స్ ఏం చేస్తున్నారు?

స్ట్రీట్ ఫైట్ అని నేను మెయిన్ లీడ్‌లో ఒక సినిమా చేస్తున్నా. మాస్ మహారాజా రవితేజ గారి మిస్టర్ బచ్చన్ సినిమాలో ఫ్రెండ్ క్యారెక్టర్ చేస్తున్నా. ఇంకా కొన్ని చర్చల దశలో ఉన్నాయి.

# టుక్ టుక్" - చిత్రవాహిని మరియు ఆర్ వై జి బ్యానర్‌లచే ఆవిష్కరించబడిన సరి కొత్త టైటిల్

చిత్రవాహిని మరియు ఆర్ వై జి బ్యానర్‌లు తమ తాజా చలనచిత్రం టైటిల్ "టుక్ టుక్" టైటిల్ పోస్టర్ ని శ్రీ రామ నవమి సందర్భంగా విడుదల చేశారు. విచిత్రమైన ఆటో ఈ పోస్టర్ లో చాలా ఆకర్షణీయంగా ఉంది. చూడడానికి ఏదో ఫాంటసీ చిత్రాన్ని తలపించేలా పోస్టర్ లుక్ ఉంది. సుప్రీత్ సి కృష్ణ దర్శకత్వం వహించిన, "టుక్ టుక్" ఒక ఆహ్లాదకరమైన సినిమాటిక్ అనుభూతిని అందిచేలా ఉంది, అసలు కథలో ఆ ఆటో పాత్ర ఏంటి అనేది ముందు ముందు యూనిట్ సభ్యులు ఇచ్చే అప్డేట్స్ లో చూసి తెలుసుకోవాలిసి ఉంది. పోస్టర్ లో అంశాలని బట్టి ఈ కథ ఒక గ్రామం నేపథ్యంలో సెట్ చేయబడింది. అనేక ఫాంటసీ ఎలెమెంట్స్ కూడా ఈ పోస్టర్ లో కనిపిస్తున్నాయి.రాహుల్ రెడ్డి, లోక్కు సాయి వరుణ్ మరియు శ్రీరాములు రెడ్డి నిర్మించిన "టుక్ టుక్" క్రియేటివ్ తరహాలో ప్రేక్షకుల మనన్నలు పొందుతుంది. పోస్టర్ లో హీరో నో హీరోయిన్ ఓ కాకుండా ఈ ఆటో పెట్టడం వెనుక ఉన్న కథాంశం ఏంటి అనేది కూడా ప్రేక్షకులు చర్చించుకుంటున్నారు. దీనికి సంతు ఓంకార్ సంగీతం అందించారు మరియు హార్థిక్ శ్రీకుమార్ సినిమాటోగ్రఫీ అందించారు. "టుక్ టుక్" ఒక ఉత్తేజకరమైన సినిమాటిక్ రైడ్‌గా ఎక్స్పీరియన్స్ చెయ్యడానికి ప్రేక్షకులు సిద్ధంగా ఉన్నట్టు ఈ పోస్టర్ రెస్పాన్స్ బట్టి అర్ధమవుతుంది. తారాగణం: హర్ష రోషన్ కార్తికేయ దేవ్ స్టీవెన్ మధు సాన్వీ మేఘన నిహాల్ కోధాటి

# నారా రోహిత్ ల్యాండ్ మార్క్ 20వ చిత్రం "సుందరకాండ" ఫస్ట్ లుక్ విడుదల , సెప్టెంబర్ 6, 2024న థియేట్రికల్ రిలీజ్

హీరో నారా రోహిత్ ల్యాండ్ మార్క్ 20వ చిత్రం "సుందరకాండ".దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి ను పరిచయం చేస్తూ సందీప్ పిక్చర్ ప్యాలెస్ (ఞఖఖ) బ్యానర్ పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి మరియు రాకేష్ మహంకాళి నిర్మించిన వినోదభరితమైన రొమ్–కామ్ చిత్రం "సుందరకాండ". ప్రతి వ్యక్తికి రిలేట్ అయ్యేలా జీవితం లో ఉండే అన్ని రకాల ఎమోషన్స్ ని చూపించే విధంగా ఈ చిత్రం ఉండబోతుంది. నారా రోహిత్ కూల్ అండ్ క్లాసీ అవతార్ లో చేతిలో కుండతో, మరో చేతిలో పుస్తకంతో ఉన్న ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా సినిమాకు సుందరకాండ అనే టైటిల్ ను మేకర్స్ ప్రకటించారు. పోస్టర్ లో కాలేజీ విద్యార్థులు వ్యతిరేక దిశలో నడుస్తున్నట్లు మనం చూడవచ్చు. ఈ సినిమా విడుదల తేదీని కూడా నిర్మాతలు ప్రకటించారు. ఇది గణేష్ చతుర్థి (సెప్టెంబర్ 7) సందర్భం గా సెప్టెంబర్ 6,2024 న ప్రేక్షకుల ముందుకి రానుంది.

సుందరకాండ హిందూ ఇతిహాసం రామాయణంలో ఐదవ పుస్తకం. సినిమాపై పాజిటివ్ ఇంప్రెషన్ని క్రియేట్ చేసే ఫస్ట్ లుక్ పోస్టర్ ని ఆవిష్కరించడానికి శ్రీరామ నవమి పర్వదినాన్ని సరైన సందర్భం గా భావించి మేకర్స్ ఈ రోజు టైటిల్ మరియు ఫస్ట్ లుక్ విడుదల చేయడం జరిగింది. వృతి వాఘని కథానాయికగా నటిస్తుండగా, శ్రీ దేవి విజయ్ కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్ కీలక పాత్రలు పోషించనున్నారు. ప్రదీప్ ఎమ్ వర్మ సినిమాటోగ్రఫీ అందించగా, లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రానికి సందీప్ ఎగ్జిక్యూటివ్ నిర్మాత కాగా, రాజేష్ పెంటకోట ప్రొడక్షన్ డిజైనర్, రోహన్ చిల్లాలే ఎడిటర్. తారాగణం: రోహిత్ నారా, వృతి వాఘని, శ్రీ దేవి విజయ్ కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్, కమెడియన్ సత్య, అజయ్, ఋం గణేష్, అభినవ్ గోమతం, విశ్వంత్, రూపా లక్ష్మి, సునైనా, రఘు బాబు.

# స్టూడియో గ్రీన్, జియో స్టూడియోస్ నిర్మాణంలో ప్రముఖ దర్శకుడు పా రంజిత్ రూపొందిస్తున్న "తంగలాన్" సినిమా నుంచి హీరో చియాన్ విక్రమ్ బర్త్ డే స్పెషల్ గ్లింప్స్ రిలీజ్

చియాన్ విక్రమ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ "తంగలాన్". ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు పా రంజిత్ రూపొందిస్తున్నారు. స్టూడియో గ్రీన్, జియో స్టూడియోస్ బ్యానర్స్ పై ప్రొడ్యూసర్ కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఇవాళ చియాన్ విక్రమ్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు బర్త్ డే విశెస్ చెబుతూ "తంగలాన్" సినిమా నుంచి స్పెషల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ సినిమా కోసం విక్రమ్ ఎంతగా కష్టపడ్డాడో ఈ గ్లింప్స్ చూపించింది. అలాగే విక్రమ్ ఎలా తన పర్ ఫార్మెన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ తో ఎలా మెస్మరైజ్ చేయబోతున్నాడో ఈ వీడియోతో తెలుస్తోంది. "తంగలాన్" సినిమా కోసం విక్రమ్ మారిపోయిన తీరు ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరుస్తోంది.

ఈ గ్లింప్స్ రిలీజ్ సందర్భంగా దర్శకుడు పా. రంజిత్ మాట్లాడుతూ – "తంగలాన్" సినిమాను చరిత్రలో జరిగిన కొన్ని యదార్థ ఘటనల నేపథ్యంతో తెరకెక్కిస్తున్నాం. ఆ అడ్వెంచర్ స్టోరీని రూపొందించడంలో హీరో విక్రమ్ తో పాటు మూవీ టీమ్ నాకు ఎంతో సపోర్ట్ చేసింది. ప్రముఖ ప్రొడక్షన్ కంపెనీ జియో స్టూడియోస్ "తంగలాన్" సినిమా కోసం స్టూడియో గ్రీన్ తో చేతులు కలపడం సంతోషంగా ఉంది. జియో స్టూడియోస్ రాకతో మా సినిమా గ్లోబల్ ఆడియెన్స్ కు మరింతగా రీచ్ అవుతుందని ఆశిస్తున్నాం. హీరో విక్రమ్ "తంగలాన్" సినిమా కోసం ఎంతగా కష్టపడ్డారో ఈ గ్లింప్స్ మీకు చూపిస్తుంది. అన్నారు.

"తంగలాన్" సినిమాలో పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యదార్థ ఘటనల ఆధారంగాఈ సినిమా రూపొందింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమా త్వరలోనే పాన్ ఇండియా లాంగ్వేజెస్ తో పాటు వరల్డ్ వైడ్ రిలీజ్ కు సిద్ధమవుతోంది.

నటీనటులు – చియాన్ విక్రమ్, మాళవిక మోహనన్, పార్వతీ తిరువోతు, పశుపతి, హరికృష్ణన్, అన్బు దురై తదితరులు

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**